**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 33, పేజీలు - 08

బుధవారం, జులై 29, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD









## అధికారి నియామకం ప్రభుత్వ విచక్షణాధికారం

### - హైకోర్టు ఆదేశాలపై సీఎం రేవంత్ రెడ్డి రియాక్షన్

- రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షిస్తామన్న సీఎం
- హైడ్రా అనేది ప్రభుత్వం తెచ్చిన అతిపెద్ద సంస్కరణ అని వెల్లడి
- ఆక్రమణదారులు కోర్టుల్నే తప్పుదోవ పట్టిస్తున్నారు ఆరోపణ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని చెరువులు, నాలాల పునరుద్ధరణే ధ్యేయంగా తీసుకొచ్చిన హైడ్రా వ్యవస్థ, ఆ వ్యవస్థను నడుపుతున్న రంగనాథ్ నియామకంపై తెలంగాణ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. భారీగా కోర్టు ధిక్కరణ కేసులు ఉన్న హైడ్రా కమిషనర్ ను తక్షణం బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. మరో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని సూచించింది. ఈ తీర్పుతో హైడ్రా గురించి బీఆర్ఎస్ నేతలు విరుచుకుపడ్డారు. అయితే ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాల విమర్శలపై అత్యంత ఘాటుగా స్పందించారు. ఒక అధికారిని ఎక్కడ నియమించాలి, ఏ బాధ్యతలు అప్పగించాలనేది పూర్తిగా ప్రభుత్వ విచక్షణాధికారం అని స్పష్టం చేసిన సీఎం హైడ్రా కమిషనర్‌ను తొలగించే ప్రసక్తే లేదని, ఈ అంశాన్ని న్యాయస్థానాల్లోనే చట్టబద్ధంగా ఎదుర్కొంటామని సంకేతాలు ఇచ్చారు.

2లో..

## పదేళ్ల జైలు, రూ.10 కోట్ల జరిమానా

### - పేపర్ లీక్ నిరోధక బిల్లులోని కీలకాంశాలు!



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)**దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన విస్తృత నిరసనలు, రాజకీయా పరిణామాల నేపథ్యంలో పేపర్ లీకుల నిరోధక చట్టాన్ని సవరించడానికి సోమవారం కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం పేపర్ లీకులలో ప్రమేయం ఉన్నట్లు రుజువైన వ్యక్తులకు పదేళ్ల జైలు శిక్ష, రూ. 50 లక్షల జరిమానా విధించవచ్చు. జులై 20న పార్లమెంటు వరకు జరిగిన పాదయాత్ర సందర్భంగా నిరసనకారులపై జరిగిన అణచివేతలో చోటుచేసుకున్నట్లు ఆరోపించబడిన అరాచకాలపై ప్రభుత్వం స్పందించాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేస్తున్న తరుణంలో.. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

**ఈ సవరణ బిల్లు ప్రకారం..**

పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం,

2లో..

## హైడ్రా పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు

### - రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

- హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు
- బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా అన్న కేటీఆర్
- కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి

2లో..



## హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

### - జలమయమైన రోడ్లు, స్తంభించిన ట్రాఫిక్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భాగ్యనగరాన్ని మంగళవారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకధాటిగా కురిసిన కుండపోత వానకు రహదారులన్నీ జలమయమయ్యాయి.

2లో..

## ఎల్‌నినో ఉపద్రవాన్ని అధిగమించడం ఓ సవాల్

- ఏపీలో ఎల్నినో ప్రభావంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- జులై నెలలో 69 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు సీఎంకు తెలిపిన అధికారులు
- అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతుందని వ్యాఖ్య

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా చూపుతోంది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, నీటిపారుదల శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు జూమ్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు పరిస్థితి తీవ్రతను ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో జూలై నెలలో ఏకంగా 69 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో సగటున 35 నుంచి 40 శాతం వరకు వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఎల్ నినో కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ చర్యలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.



**ఎల్ నినో ఉపద్రవం..**

ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఎల్ నినో ఉపద్రవాన్ని అధికార యంత్రాంగం మొత్తం ఒక సవాల్‌గా స్వీకరించి సమష్టిగా పనిచేయాలి. మంత్రి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. వరదలు,

2లో..

## అమరావతిలో ప్రెసిషన్ ఆంకాలజీ క్యాన్సర్ సెంటర్

### - ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా ఒప్పందం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** క్యాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది.

2లో..



## తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

### - శివరాజ్ సింగ్ చౌహాన్ తో రేవంత్ రెడ్డి భేటీ

- గత ప్రభుత్వంలో గృహనిర్మాణ రంగం నిర్లక్ష్యానికి గురైందన్న రేవంత్
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చాలని విన్నపం
- గ్రామీణ కుటుంబాలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలన్న సీఎం



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద 11,56,915 ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత

2లో..

## తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే

### - చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారన్న బీజేపీ చీఫ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి

2లో..

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్

### - లైంగిక వేధింపుల కేసులో కీలక పరిణామం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నమోదైన కేసులో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు.

2లో..

## ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌లకు కేంద్రం సమన్లు

### - ఆగస్టు 3న సోషల్ మీడియా ప్రతినిధులతో భేటీ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ, వినియోగదారుల గోప్యత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్), గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్ వంటి దిగ్గజ సంస్థలకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమన్లు జారీ చేసింది. ఆగస్టు 3న నిర్వహించనున్న పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరై, సంబంధిత అంశాలపై వివరణ ఇవ్వాలని సోషల్ మీడియా ప్రతినిధులను ఆదేశించింది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సమావేశానికి టెక్ కంపెనీల ప్రతినిధులతో పాటు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మరియు హోం మంత్రిత్వ శాఖల

2లో..

## కెమెరా యాంగిల్ కాదు, హృదయం యాంగిల్ మార్చండి

2లో..

### - ప్రధాని మోదీకి ప్రియాంక గాంధీ చురక



## నేర చరిత్ర లేని వారిపై చర్యలు వద్దు

### - విద్యార్థుల ఆందోళనలపై సుప్రీం కీలక ఆదేశాలు

- విద్యార్థుల ఆందోళనలపై సిట్ కు దిశానిర్దేశం
- అదుపులో ఉన్న మైనర్లను విడుదల చేయాలని ఆదేశం
- ఎలక్ట్రానిక్ ఆధారాలు భద్రపరచాలని సూచన
- కేంద్రం, ఏడు రాష్ట్రాలకు నోటీసులు

2లో..



# మానవత్వంతో స్పందించి బాధితులకు అండగా నిలవాలి

- టీఆర్ఎస్ చీఫ్ కవిత
- నేరెళ్ల పోలీస్ దాష్టీకంపై కవిత సంచలన వ్యాఖ్యలు
- బాధితులకు బహిరంగ క్షమాపణ. రూ. కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్.
- రేవంత్, కేటీఆర్, బండి సంజయ్‌లపై ప్రశ్నల వర్షం.



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) నేరెళ్ల పోలీస్ దాష్టీక ఘటన మరోసారి రాజకీయంగా వేడెక్కింది. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మంగళవారం నేరెళ్ల బాధితుడు దివంగత గంధం గోపాల్ కుటుంబాన్ని పరామర్శించి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ దమనకాండపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆమె, అప్పటి పాలక కుటుంబంలో సభ్యురాలిగా ఉన్నందుకు సిగ్గుతో తలదించుకుంటున్నానని పేర్కొన్నారు. నేరెళ్ల బాధితులకు బహిరంగంగా క్షమాపణలు చెబుతున్నానని ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బాధితుల రక్తంపై అందరూ రాజకీయం చేశారే తప్ప, వారికి న్యాయం చేయలేదని మండిపడ్డారు. నేరెళ్ల బాధితులకు ప్రభుత్వం రూ. కోటి పరిహారం ఇవ్వాలని, అప్పటి పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌లు ఈ ఘటనపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు బాధితుల పేరుతో ఓట్లు అడిగిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా బాధితులను పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలోసిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి మజీద్, మాజీ మంత్రి బోడ జనార్దన్, రాష్ట్ర నాయకులు రూప్ సింగ్, పవన్, రంజిత్, ఆనంద్, ప్రవీణ్, కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ నాగరాజు, మానకొండూరు నియోజకవర్గం ఇంచార్జ్ చైతన్య, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్, జావిద్, మార్వాడి దేవరాజు, బైరి రాజేష్, అశోక్, భూపతి, రాజిరెడ్డి, రమావత్ మోహన్, రేణుక, మంగ, లాస్య, శైలజ, సంధ్య, వీర్నపల్లి ఇంచార్జ్ బండి శ్రీహరి, వేములవాడ ఇంచార్జ్ తోట కనకయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా హాకీ క్రీడలో ఉత్తమ ఆటను ప్రదర్శించిన జూనియర్ షేక్ అబ్దుల్ కరీం






ఆలేరు (ప్రశ్న న్యూస్) అంతరాష్ట్ర హాకీ ఖేలో ఇండియా పోటీలు ఉమ్మడి నల్గొండ జిల్ల కేంద్రం లో నిర్వహించిన హాకీ క్రీడాల్లో ఆలేరు పట్టణం నుండి ప్రతినిధ్యం వహించిన హాకీ టీమ్ అత్యుత్తమ్మ అటను ప్రదర్శించి మొదటి బహుమతిని సాధించింది. ఆలేరు పట్టణమ్ బీసీ కలనికి చెందిన జూనియర్ షేక్ అబ్దుల్ కరీం ఉత్తమ ఆటను ప్రదర్శించినందుకు టీమ్ మానేజ్మెంట్ మరియు కుటుంబ సభ్యులు జానిమియా తాత బాలాగేయాలు రచయిత షేక్ జానిమియా,షేక్ హనీఫ్ మరియు ఆలేరు ప్రతమిక పాఠశాల యాజమాన్యం ఆలేరు పట్టణ ప్రజలు అభినందించారు.

# పొగాకు రైతుల నిరసన కార్యక్రమం

**ప్రకాశం జిల్లా** పొగాకు రైతులు చేపట్టనున్న నిరసన కార్యక్రమం నేపథ్యంలో, మంగళవారం జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో రైతు సంఘాల నాయకులతో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మరియు పోలీసు అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ప్రతి ఒక్కరికీ హక్కు ఉన్నప్పటికీ, నేషనల్ హై రోడ్డు దిగ్బంధం చేయడం, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలకు పోలీసు శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు.రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే ప్రక్రియలో పోలీసు శాఖ అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. నిరసన కార్యక్రమంలో పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అసాంఘిక శక్తులు చొరబడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని రైతు సంఘాల నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే, జాతీయ రహదారులు దిగ్బంధం చేయకుండా, సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో తమ నిరసనను వ్యక్తం చేయాలని సూచించారు. ప్రస్తుతం సెక్షన్?30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున, శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. దీనికి స్పందించిన రైతు సంఘాల నాయకులు, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, పోలీసు శాఖ సూచనలను పాటిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, దర్శి డీఎస్పీ బాలమురళికృష్ణ, సంబంధిత సీఐలు పాల్గొన్నారు.

# గురువే దైవం..వ్యాస మహర్షి జన్మదినం,

- గురుపౌర్ణమి మహిమ అజ్ఞానాంధకారాన్ని తొలగింపు
- జ్ఞానజ్యోతిని వెలిగించే గురువుకు అంకితమైన మహా పర్వదినం
- భారతీయ సంస్కృతిలో గురు-శిష్య పరంపరకు శాశ్వత చిహ్నం
-"గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్దేవో మహేశ్వరః...
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః."



ఈ శ్లోకం భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంత ఉన్నతమైనదో తెలియజేస్తుంది. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, గురువు జీవితానికి అర్థాన్ని, దిశను, విలువలను అందిస్తాడు. అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించే మహోన్నత వ్యక్తి గురువు. అలాంటి గురువులను స్మరించుకుని, వారి పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే పవిత్రమైన పర్వదినమే గురుపౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమి.

ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున దేశవ్యాప్తంగా ఈ పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. విద్యార్థులు, శిష్యులు, ఆధ్యాత్మిక సాధకులు, భక్తులు తమ గురువులను దర్శించుకుని ఆశీర్వాదాలు పొందుతారు. ఈ రోజు కేవలం ఒక పండుగ మాత్రమే కాదు... భారతీయ జ్ఞాన సంప్రదాయానికి, గురు-శిష్య సంబంధానికి ప్రతీకగా నిలిచే సాంస్కృతిక వేడుక.

## వ్యాస మహర్షి జన్మదినమే గురుపౌర్ణమి

గురుపౌర్ణమిని వ్యాస పౌర్ణమి అని కూడా పిలుస్తారు. దీనికి ప్రధాన కారణం వేదవ్యాస మహర్షి జన్మదినం ఇదే కావడం.

వ్యాస మహర్షి భారతీయ సంస్కృతికి అందించిన సేవలు అపారమైనవి. నాలుగు వేదాలను క్రమబద్ధీకరించి, మహాభారతాన్ని రచించి, పద్దెనిమిది పురాణాలను ప్రపంచానికి అందించిన మహానుభావుడు వ్యాసుడు. అందుకే ఆయనను "జగద్గురువు"గా ఆరాధిస్తారు. భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించిన మహర్షి జ్ఞాపకార్థమే గురుపౌర్ణమిని జరుపుకుంటారు.

## 'గురు' అనే పదానికి అర్థం ఏమిటి.?

సంస్కృతంలో 'గు' అంటే చీకటి, 'రు' అంటే తొలగించేవాడు. అంటే...

అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే వ్యక్తే గురువు.

గురువు కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానాన్ని మాత్రమే కాదు, జీవితాన్ని ఎలా గడపాలో కూడా నేర్పిస్తాడు. కష్టాల్లో ధైర్యం, విజయాల్లో వినయం, సమాజం పట్ల బాధ్యత, వ్యక్తిత్వ వికాసం వంటి విలువలను అందిస్తాడు.

## భారతీయ సంస్కృతిలో గురువు స్థానం

భారతీయ సంప్రదాయంలో గురువుకు దైవంతో సమానమైన గౌరవం ఉంది.

"మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ" అనే వాక్యం గురువు స్థాయిని స్పష్టంగా తెలియజేస్తుంది.

తల్లి శరీరాన్ని ఇస్తుంది... తండ్రి జీవనాధారాన్ని కల్పిస్తాడు... గురువు జీవితానికి లక్ష్యాన్ని చూపిస్తాడు.

అందుకే గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపంగా భావిస్తారు.

## గురు-శిష్య పరంపర గొప్పతనం

భారతదేశ విద్యా వ్యవస్థకు మూలాధారం గురుకుల విధానం.

వశిష్ఠుడు-శ్రీరాముడు, ద్రోణాచార్యుడు-అర్జునుడు, సాందీపని-శ్రీకృష్ణుడు, చాణక్యుడు-చంద్రగుప్తుడు...

ఈ గురు-శిష్య సంబంధాలే భారత చరిత్రను మలిచాయి.

గురువు కేవలం విద్యాబోధకుడు కాదు. శిష్యుని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శిల్పి.

## గురుపౌర్ణమి రోజున జరిగే విశేషాలు

ఈ రోజున దేశవ్యాప్తంగా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గురుపూజలు

వ్యాసపూజ

వేదపారాయణాలు

భజనలు

ధ్యాన శిబిరాలు

సత్సంగాలు

సత్యనారాయణ స్వామి వ్రతాలు

అన్నదాన కార్యక్రమాలు

విద్యార్థులు తమ ఉపాధ్యాయులను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి ఆశీర్వాదాలు తీసుకుంటారు.

అనేక మంది భక్తులు ఉపవాసం పాటించి చంద్రోదయం అనంతరం భోజనం చేస్తారు.

## ఆధ్యాత్మిక గురువు ప్రాముఖ్యత

ఆధ్యాత్మిక మార్గంలో గురువు పాత్ర మరింత విశిష్టమైనది.

దైవాన్ని తెలుసుకోవడానికి, ఆత్మజ్ఞానాన్ని పొందడానికి గురువు మార్గదర్శకుడవుతాడు.

శ్రీ ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రమణ మహర్షి...

వీరి బోధనలు కోట్లాది మందికి మార్గదర్శకంగా నిలిచాయి.

గురుదక్షిణ అంటే ఏమిటి?

పూర్వం గురుకుల విద్య పూర్తయిన తర్వాత శిష్యులు తమ గురువుకు గురుదక్షిణ సమర్పించేవారు.

కానీ అసలు గురుదక్షిణ ధనం కాదు.

గురువు బోధించిన విలువలను జీవితంలో ఆచరించడం... నిజాయితీగా జీవించడం... సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగడం...

ఇవే నిజమైన గురుదక్షిణ.

## నేటి కాలంలో గురుపౌర్ణమి అవసరం

సాంకేతిక యుగంలో సమాచారం వేలికొనపైకి వచ్చింది.

అయితే సమాచారం వేరు... జ్ఞానం వేరు...

గూగుల్ సమాచారం ఇస్తుంది. గురువు వివేకాన్ని నేర్పుతాడు.

మొబైల్ సమాధానాలు చెబుతుంది. గురువు సరైన ప్రశ్నలు అడగడం నేర్పుతాడు.కృత్రిమ మేధస్సు (ఎ 1) సమాచారం అందించగలదు. కానీ విలువలు, వ్యక్తిత్వం, మానవత్వం మాత్రం గురువే నేర్పగలడు.

## ఉపాధ్యాయుడే నిజమైన జాతి నిర్మాత

ఒక మంచి గురువు...

ఒక మంచి వైద్యుడిని తయారు చేస్తాడు.

ఒక మంచి శాస్త్రవేత్తను తీర్చిదిద్దుతాడు.

ఒక సమర్థ పరిపాలకుడిని రూపొందిస్తాడు.

ఒక బాధ్యతగల పౌరుడిని సమాజానికి అందిస్తాడు.

అందుకే ఉపాధ్యాయుడిని లిలి"జాతి నిర్మాత"లిలిగా పిలుస్తారు.

## గురుపౌర్ణమి ఇచ్చే సందేశం

ఈ పర్వదినం మనకు మూడు ముఖ్యమైన విలువలను గుర్తుచేస్తుంది.

వినయం – గురువు ముందు తలవంచడం.

విద్య – నేర్చుకోవడం ఎన్నటికీ ఆపకూడదు.

విలువలు – జ్ఞానాన్ని సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలి.

సమాజానికి మార్గదర్శకులు గురువులు

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆధ్యాత్మిక గురువులు, కళల గురువులు, జీవితంలో మార్గనిర్దేశం చేసిన ప్రతి ఒక్కరూ గురువులే.

## వారి ఆశీర్వాదం ఉంటేనే వ్యక్తి ఉన్నత శిఖరాలను అధిరోహించగలడు.


"గురువు ఇచ్చేది పాఠాలు మాత్రమే కాదు... జీవితాన్ని గెలిచే మార్గం. గురువు చూపేది దారి మాత్రమే కాదు... మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దే వెలుగు."

గురుపౌర్ణమి ఒక పండుగ మాత్రమే కాదు; అది భారతీయ సంస్కృతి, జ్ఞాన సంప్రదాయం, గురు-శిష్య బంధం, విలువల జీవన విధానానికి ప్రతీక. మారుతున్న కాలంలో సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, గురువు స్థానాన్ని ఏ యంత్రం భర్తీ చేయలేదు. పుస్తకాలు జ్ఞానాన్ని అందిస్తే, గురువు ఆ జ్ఞానాన్ని సద్వినియోగం చేసే వివేకాన్ని ప్రసాదిస్తాడు. ఈ గురుపౌర్ణమి సందర్భంగా మన జీవితంలో మార్గదర్శకులైన గురువులందరికీ కృతజ్ఞతలు తెలుపుదాం. వారు బోధించిన విలువలను ఆచరిస్తూ, మంచి వ్యక్తులుగా, మంచి పౌరులుగా ఎదగడమే వారికి అర్పించే అత్యున్నత గురుదక్షిణ.

# జ్ఞానం, వివేకం, ఆత్మసాక్షాత్కారం వైపు నడిపించే వాడే 'గురువు'

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।
గురుః సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః॥





గురు పూర్ణిమా లేదా వ్యాస పూర్ణిమ అని కూడా పిలువబడే ఈ పండుగ ఎంతో విశిష్టమైనది. జ్ఞానాన్ని, వివేకాన్ని అందించడంలో గురువులు, ఉపాధ్యాయులు, ఆధ్యాత్మిక మార్గదర్శకుల కృషిని గుర్తించి గౌరవించే పవిత్రమైన పండుగ. హిందూ, బౌద్ధ జైన మతాలలో జరుపుకునే గురు పూర్ణిమ, బుద్ధ భగవానుని మొదటి ఉపదేశకుడు, మహావీరుని మొదటి శిష్యుడైన వేద వ్యాస మహర్షి జ్ఞాపకార్థం జరుపుకుంటారు. భక్తులు ఈ రోజును ప్రార్థనలు, గురుపూజ, ధ్యానం, దానధర్మాలు కృతజ్ఞతాభావాలతో పాటిస్తారు. పవిత్రమైన ఆషాఢ పౌర్ణమి సందర్భంగా, నేడు (బుధవారం) గురు పౌర్ణమి జరుపుకుంటున్నాము. వ్యాస పౌర్ణమి అని కూడా పిలువబడే ఈ పూజ్యమైన పండుగ, జ్ఞానం, వివేకం, ఆత్మసాక్షాత్కార మార్గాన్ని ప్రకాశింపజేసే గురువులు, ఉపాధ్యాయులు, మార్గదర్శకులు, ఆధ్యాత్మిక గురువులను భక్తిభావం పూజిస్తారు. హిందూ, బౌద్ధ జైన సంప్రదాయాలలో లక్షలాది మంది జరుపుకునే గురు పూర్ణిమ, గురు-శిష్యుల మధ్య ఉన్న శాశ్వతమైన సంబంధాన్ని ఒక వేడుకగా జరుపుకుంటారు. హిందువులు మహర్షి వేద వ్యాసుడిని గౌరవిస్తుండగా, బౌద్ధులు సారనాథ్‌లో బుద్ధ భగవానుడు చేసిన మొదటి ఉపన్యాసాన్ని స్మరించుకుంటారు, జైనులు మహావీరుడు గౌతమ స్వామిని తన మొదటి శిష్యుడిగా దీక్షనివ్వడాన్ని గుర్తుచేసుకుంటారు. ఈ విభిన్న సంప్రదాయాలు ఉన్నప్పటికీ, ఈ పండుగ ఒక ఉమ్మడి సందేశాన్ని పంచుకుంటుంది: నిజమైన జ్ఞానం జీవితాలను మారుస్తుంది, ప్రతి అర్థవంతమైన ప్రయాణం ఒక యోగ్యుడైన మార్గదర్శకుడితోనే ప్రారంభమవుతుంది. నేటి ప్రపంచంలో, గురు పౌర్ణమి స్ఫూర్తి ఆధ్యాత్మిక గురువులకు మాత్రమే పరిమితం కాదు. తల్లిదండ్రులు, విద్యావేత్తలు, మార్గదర్శకులు, శిక్షకులు తమ జ్ఞానంతో మన జీవితాలను సానుకూలంగా తీర్చిదిద్దిన ప్రతి ఒక్కరిని గుర్తించడానికి ఇది ఒక అవకాశం. ఆషాఢ మాసంలోని పౌర్ణమి నాడు జరుపుకునే ఈ పండుగ, గురుశిష్యుల మధ్య ఉండే కాలాతీత సంబంధానికి ప్రతీకగా నిలుస్తుంది.

## "గురువు" అనే పదం సంస్కృతం నుండి వచ్చింది

## గు - చీకటి లేదా అజ్ఞానం

## రూ - చీకటిని తొలగించేవాడు

అందువల్ల, అజ్ఞానాన్ని తొలగించి, ఒక వ్యక్తిని జ్ఞానం, వివేకం, ఆత్మసాక్షాత్కారం వైపు నడిపించేవాడే గురువు అని సాంప్రదాయకంగా భావిస్తారు.

గురు పూర్ణిమ హిందూమతంలో లోతుగా పాతుకుపోయినప్పటికీ , దీనిని బౌద్ధ , జైన మతాలలో కూడా పాటిస్తారు . ఈ రెండు సంప్రదాయాలకు ప్రత్యేకమైన ముఖ్యమైన ఆధ్యాత్మిక ఘట్టాలను ఇది స్మరించుకుంటుంది. ఈ మూడు మతాలలోను, నైతిక, మేధో, ఆధ్యాత్మిక ఎదుగుదలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషించే పరివర్తనాత్మక పాత్రను ఈ రోజు వేడుకగా జరుపుకోవడం విశేషం. గురువు అనే పదానికి అర్థం మత గురువులకే పరిమితం కాలేదు. తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, జీవిత మార్గదర్శకులు, సానుకూల మార్పును ప్రేరేపించే వ్యక్తులు కూడా విస్తృత అర్థంలో గురువులుగా పరిగణించబడతారు. అందువల్ల, జ్ఞానం, కరుణ, మార్గదర్శకత్వంతో మన ప్రయాణాన్ని ప్రభావితం చేసిన వారిని గుర్తించాలనే సార్వత్రిక స్ఫూర్తిగా గురు పౌర్ణమి నిలుస్తుంది.

## వ్యాస పూర్ణిమ

హిందూమతంలో అత్యంత ప్రభావవంతమైన ఋషులలో ఒకరైన మహర్షి వేద వ్యాసుడిని గౌరవిస్తు, గురు పౌర్ణమిని వ్యాస పౌర్ణమిగా జరుపుకుంటారు. నాలుగు వేదాలను సంకలనం చేయడం, మహాభారతాన్ని రచించడం, బ్రహ్మసూత్రాలను రూపొందించడం, పురాణాలకు గణనీయంగా దోహదపడి , విస్తారమైన వేద జ్ఞానాన్ని మానవాళికి మరింత అందుబాటులోకి తీసుకురావడం వంటి ఘనత ఆయనకే దక్కుతుంది. ఆయన చేసిన అపారమైన సాహిత్య, ఆధ్యాత్మిక కృషి కారణంగా, వేద వ్యాసుడిని వేద జ్ఞానానికి ఆది గురువుగా పూజిస్తారు. ఆయన శాశ్వత వారసత్వానికి ప్రతీకగా ఈ రోజుగా గురు పౌర్ణమిని పాటిస్తారు. సాంప్రదాయకంగా, శిష్యులు తమ గురువులకు పువ్వులు, పండ్లు, ప్రార్థనలతో పొందిన జ్ఞానానికి కృతజ్ఞతగా గురుదక్షిణను సమర్పించి గౌరవిస్తారు. మరికొందరు భక్తులు పవిత్ర గ్రంథాలను పఠిస్తు సత్సంగాలలో పాల్గొని గురు పూజ చేస్తు తమ వ్యక్తిగత, ఆధ్యాత్మిక ఎదుగుదలకు మార్గనిర్దేశం చేసిన బోధనలను స్మరించుకుంటారు. దేవాలయాలు, ఆశ్రమాలు, గృహాలలో, భక్తులు మహర్షి వేదవ్యాసున్ని, తమ గురువులను పూజిస్తు, జ్ఞాన ప్రసారమే సనాతన ధర్మానికి పునాది అని గుర్తిస్తారు.

# ఏలేరు ఆయకట్టుకు జీవధార, 1000 క్యూసెక్కుల నీటికి గ్రీన్ సిగ్నల్

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**ఖరీఫ్ సాగుకు భరోసా**

**-- 53 వేల ఎకరాలకు సాగునీరు..**

**చివరి ఆయకట్టుకు చేరేలా ప్రత్యేక చర్యలు**




కాకినాడ(ప్రశ్న న్యూస్) తూర్పు గోదావరి ప్రాంత రైతులకు ఊరటనిచ్చే కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఏలేరు ప్రాజెక్టు నుంచి 1000 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేయాలని ప్రత్యేక సాగునీటి సలహా సంఘం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలోని 53 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భరోసా లభించనుంది.కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీ విప్ పిడుగు హరిప్రసాద్, ఇరిగేషన్ ఈఎన్సీ నరసింహమూర్తి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతు ప్రతినిధులు పాల్గొని ఖరీఫ్ సాగునీటి విడుదలపై సమగ్రంగా చర్చించారు.సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు పిఠాపురం బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 13 వేల ఎకరాలకు నిరంతరాయంగా సాగునీరు అందించేలా కార్యాచరణ రూపొందించారు. ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.2 కోట్లకు పైగా వ్యయంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు.రైతుల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఏలేరు ఆయకట్టు అభివృద్ధి కోసం అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం చేపడుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ రష్మి పెరుమాళ్

**రికార్డులు, దర్యాప్తు కేసుల సమీక్ష - సిబ్బందికి కీలక ఆదేశాలు**

**'సిద్దిపేట సురక్ష నేత్ర' పోలీస్ ఉద్యోగమిత్ర'పై**

**విస్తృత అవగాహన కల్పించాలని సూచన**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ మంగళవారం గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి సిబ్బంది గార్డ్ ఆఫ్ ఆనర్ సమర్పించారు. స్టేషన్ ఆవరణ, కాంపౌండ్ వాల్‌పై ప్రజా అవగాహన కోసం రూపొందించిన చిత్రాలు, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, పోలీస్ రికార్డులు, పెండింగ్ దర్యాప్తు కేసులు, తీవ్రమైన నేరాల వివరాలను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది శారీరక దారఢ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించి, సిబ్బందికి కేటాయించిన కిట్ ఆర్టికల్స్, యూనిఫాం ప్రమాణాలను పరిశీలించారు.గ్రామాలపై విలేజ్ పోలీస్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సమన్వయం పెంచుతూ శాంతిభద్రతలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే సేకరించాలని సూచించారు. బీట్ విధుల్లో అనుమానితుల వేలిముద్రలను ఫింగర్‌ప్రింట్ డివైస్‌తో తనిఖీ చేసి పాత నేరస్తులను గుర్తించాలని ఆదేశించారు.'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమం కింద ప్రతి గ్రామంలో సీసీటీవీల ఏర్పాటు కోసం అవగాహన కల్పించాలని, 'సిద్దిపేట పోలీస్ ఉద్యోగమిత్ర' ఆన్‌లైన్ పోర్టల్‌ను యువత సద్వినియోగం చేసుకునేలా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, టౌన్ ఇన్స్పెక్టర్ రవికుమార్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రామకృష్ణతో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి కోర్టు ఆవరణలో బోనాల సంబరాలు



శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళా న్యాయవాదులు సాంప్రదాయబద్ధంగా అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.భారీ సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్న ఈ ఊరేగింపు ముళ్లకత్వ చెరువు కట్టపై ఉన్న కట్ట మైసమ్మ ఆలయానికి చేరుకుంది. అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. సురేందర్, ఉపాధ్యక్షులు బి. సత్యనారాయణ, కే. శ్రీదేవి, కార్యదర్శి సి.హెచ్. ప్రత్యూషతో పాటు కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# గిరి ప్రదక్షిణపై డిజిటల్ నిఘా

**సీసీ కెమెరాలు, డ్రోన్లతో 24 గంటల పర్యవేక్షణ**

**కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన: ఎమ్మెల్యే గణబాబు, ఉన్నతాధికారులు**

విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) సింహాచలం గిరి ప్రదక్షిణకు తరలివచ్చే లక్షలాది మంది భక్తుల భద్రత, సౌకర్యాల దృష్ట్యా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది. గిరి ప్రదక్షిణ మార్గమంతా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా భక్తుల రద్దీ, ట్రాఫిక్ పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారుపశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పీ.జీ.వి.ఆర్. నాయుడు (గణబాబు), నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చీ, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పర్యవేక్షణ తీరును స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న అధికారులను అడిగి ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు.అధికారులు మాట్లాడుతూ, గిరి ప్రదక్షిణ మార్గంలోని ప్రధాన జంక్షన్లు, క్యూ లైన్లు, అన్నదాన కేంద్రాలు, ఉచిత మంచినీటి కేంద్రాలు, పార్కింగ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన



సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల దృశ్యాలను భారీ ఎల్ఈడీ తెరలపై ప్రత్యక్ష ప్రసారంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా భక్తుల రద్దీ పెరిగినా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తినా లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడినా వెంటనే పోలీసు, దేవస్థానం,



జీవీఎంసీ సిబ్బందిని అప్రమత్తం చేసి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు పోలీసు, అధికార యంత్రాంగానికి సహకరించి ప్రశాంత వాతావరణంలో దర్శనాన్ని పూర్తి చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, డ్యూటీ అధికారులు, సాంకేతిక నిపుణులు నిరంతరం విధులు నిర్వహిస్తూ భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# రైతుల మోటార్లపై ముఠా కన్ను...

# పోలీసుల టెక్నాలజీ పంజా

**- 91 వాటర్ మోటార్లు మాయం.. 13 కేసులకు తెరదించిన గుంటూరు పోలీసులు**

**- ఆరు మంది అరెస్ట్.. రిసీవర్ అదుపులో.. రూ.15.33 లక్షల విలువైన 85 మోటార్లు స్వాధీనం**

**- ఒక్క సీసీ కెమెరా క్లూతో మొదలైన దర్యాప్తు.. ఏపీఆర్ టవర్ లొకేషన్, సిడిఆర్తో ముఠా గుట్టురట్టు**

గుంటూరు(ప్రశ్న న్యూస్) పొలాలకు ప్రాణాధారమైన నీటి మోటార్లనే లక్ష్యంగా చేసుకుని రైతులను వణికించిన దొంగల ముఠాకు గుంటూరు జిల్లా పోలీసులు చెక్ పెట్టారు. నెలన్నర వ్యవధిలో ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా 91 వాటర్ మోటార్లను దోచుకెళ్లిన అంతర్‌జిల్లా ముఠాను సాంకేతిక ఆధారాలతో ఛేదించారు. ఆరు మంది నిందితులను, దొంగ సొత్తు కొనుగోలు చేసిన ఒక రిసీవర్‌ను అరెస్టు చేసి, రూ.15.33



లక్షల విలువైన 85 వాటర్ మోటార్లు, 18 కిలోల రాగి వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

### రాత్రి వేళ రైతులే టార్గెట్

జూన్ 3 నుంచి జూలై 19 వరకు పొన్నూరు రూరల్, పొన్నూరు టౌన్, చేబ్రోలు, తెనాలి రూరల్, చుండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్ల పక్కన, పొలాల వద్ద ఏర్పాటు చేసిన వాటర్ మోటార్లను అర్ధరాత్రి వేళల్లో అపహరిస్తూ ముఠా రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. వరుస ఘటనలతో రైతులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు సవాల్‌గా మారిన ఈ కేసులను ప్రత్యేక



బృందాలు ఛేదించాయి.

### క్రెటా కారు... దొంగలకు ఉచ్చు

చింతలపూడి గ్రామంలో జరిగిన దొంగతనం కేసు దర్యాప్తులో కసుకర్రు గ్రామంలోని సీసీ కెమెరాలో కనిపించిన ఒక క్రెటా కారు పోలీసులకు కీలక ఆధారమైంది. అక్కడి నుంచి బుడంపాడు వరకు ఉన్న ప్రతి సీసీ కెమెరాను పరిశీలించి వాహనం కదలికలను ట్రాక్ చేశారు. చేబ్రోలు కెమెరా ద్వారా వాహనం గుర్తించారు. అనంతరం యాప్, టవర్ లొకేషన్, ఆధారాలతో నిందితుల జాడ కనిపెట్టి బ్రాహ్మణకోడూరు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.

### జల్సాల కోసం దొంగతనాల బాట

ప్రధాన నిందితుడు తాడిశెట్టి నాగేశ్వరరావు గతంలోనూ నేరాల్లో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించి మద్యం సేవించడం, విలాసవంతమైన జీవితం గడపడమే లక్ష్యంగా స్నేహితులను కూడగట్టి ముఠాను ఏర్పాటు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఒకరి ఆటో, అద్దెకు తీసుకున్న కార్లను వినియోగిస్తూ రాత్రివేళల్లో మోటార్లు ఎత్తుకెళ్లి విక్రయించినట్లు పోలీసులు తెలిపారు.



### 13 కేసులు... భారీ రికవరీ

ఈ ముఠా పొన్నూరు రూరల్‌లో నాలుగు, తెనాలి రూరల్‌లో ఆరు, చేబ్రోలులో ఒకటి, పొన్నూరు టౌన్‌లో ఒకటి, చుండూరులో ఒకటి... మొత్తం 13 కేసుల్లో 91 వాటర్ మోటార్లను దొంగిలించినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల వద్ద నుంచి 85 వాటర్ మోటార్లు, 18 కిలోల రాగి వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాలకు ఉపయోగించిన క్రెటా కారు, డిజైర్ కారు, ఆటోను కూడా పోలీసులు సీజ్ చేశారు.

### టెక్నాలజీతో నేరాలకు చెక్

ఈ కేసు దర్యాప్తులో సీసీ కెమెరాలు, ఏ ఎన్ పి ఆర్ మ్యాట్రిక్స్ కెమెరాలు, టవర్ లొకేషన్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషించిందని ఎస్పీ తెలిపారు.

టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే ఎంతటి నేరస్థులైనా తప్పించుకోలేరనే విషయాన్ని ఈ కేసు మరోసారి నిరూపించిందన్నారు.

### పోలీసు బృందానికి ప్రశంసలు

తెనాలి ఎస్డీపీవో బి. జనార్ధన్‌రావు పర్యవేక్షణలో, పొన్నూరు రూరల్ సీఐ పి. కృష్ణయ్య, ఎస్ఐ వి. శ్రీహరి, సాంకేతిక విభాగం అధికారులు, సీసీ కెమెరా వింగ్, టవర్ లొకేషన్ బృందం సమన్వయంతో కేసును తక్కువ సమయంలోనే ఛేదించారు. ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

# శ్రీశైలం ధర్మకర్తల మండలిలో కీలక నిర్ణయాలు

**ఆగస్టు 15 నుంచి ప్రోటోకాల్ దర్శనాలకు కొత్త విధానం**

**వరుణయాగం, సహస్రఘటాభిషేకానికి ఆమోదం**

**సామాన్య భక్తులకు మెరుగైన దర్శనం, సౌకర్యాల కల్పనపై దృష్టి**

శ్రీశైలం (ప్రశ్న న్యూస్)శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి 9వ సమావేశంలో భక్తుల సౌకర్యాలు, దర్శన వ్యవస్థలో సంస్కరణలు, ఆలయాల అభివృద్ధి, శ్రావణమాసోత్సవాల నిర్వహణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో మొత్తం 45 అజెండా అంశాలను చర్చించగా, 39 అంశాలకు ఆమోదం లభించింది. మిగిలిన ఆరు అంశాలను వాయిదా వేశారు.సమావేశంలో శ్రావణమాసోత్సవాలు, శాకంభరీ ఉత్సవం, వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకం నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగి సకాలంలో వర్షాలు కురవాలని, దేశం సస్యశ్యామలంగా ఉండాలని సంకల్పించి ఆగస్టు 7 నుంచి 11 వరకు ఐదు రోజులపాటు ఆగమశాస్త్రానుసారంగా వరుణయాగం, సహస్రఘటాభిషేకం, విశేషార్చనలు, హోమాలు, జపాలు, పారాయణాలు నిర్వహించాలని నిర్ణయించారు.

### ప్రోటోకాల్ దర్శనాలకు కొత్త విధానం

ఆగస్టు 15 నుంచి ప్రోటోకాల్ దర్శనాల్లో సంస్కరణాత్మక మార్పులు అమలు చేయాలని ధర్మకర్తల మండలి నిర్ణయించింది. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో నిర్దిష్ట విధానాన్ని అమలు చేస్తూ, సిఫారసు లేఖలను కనీసం 48 గంటల ముందుగానే సమర్పించడం తప్పనిసరి చేయనున్నారు. ప్రోటోకాల్ టికెట్ల జారీలో పూర్తి పారదర్శకత పాటించడంతో పాటు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్దిష్ట సమయాల్లో మాత్రమే ప్రోటోకాల్ దర్శనాలు నిర్వహించనున్నారు.

### దత్తత ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

శ్రీశైల దేవస్థానం దత్తత ఆలయమైన కడప జిల్లాలోని జ్యోతిస్సిద్ధవట ఆలయ జీర్ణోద్ధారణకు ఆమోదం తెలిపింది. దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని నిర్ణయించారు. అలాగే కొలనుభారతి క్షేత్రంలో ఆగస్టు 7న సరస్వతీ అమ్మవారికి శాకంభరీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు.

### భక్తులకు మరిన్ని సౌకర్యాలు

సామాన్య భక్తుల సౌకర్యార్థం క్షేత్ర పరిధిలో ఎంపిక చేసిన 20 ప్రాంతాల్లో ఆధునిక శౌచాలయ సముదాయాలను నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కో బ్లాక్‌లో 11 గదులతో పాటు స్నానపు గదులు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో బ్లాక్ నిర్మాణానికి సుమారు రూ.25 లక్షల వ్యయం అంచనా వేశారు.

హిందూమాల సత్రం నుంచి కుమారసదనం వరకు, అలాగే యోగివేమారెడ్డి సత్రం వెనుక భాగంలో సిమెంట్ కాంక్రీట్ రహదారుల నిర్మాణానికి రూ.24 లక్షల అంచనా వ్యయంతో ఆమోదం తెలిపారు. శ్రావణమాసోత్సవాల సందర్భంగా ప్రధాన గోపురాలకు విద్యుద్దీపాలంకరణ చేపట్టాలని కూడా నిర్ణయించారు.

### డార్మెటరీలు, క్యూ లైన్ల ఆధునికీకరణ

నందీశ్వర డార్మెటరీలో రూ.39 లక్షల వ్యయంతో, నీలకంఠేశ్వర డార్మెటరీలో రూ.23 లక్షల వ్యయంతో డక్టబుల్ ఎయిర్ కూలర్లు



ఏర్పాటు చేయనున్నారు. క్యూ కాంప్లెక్స్‌లో అదనపు వాటర్ కూలర్లు ఏర్పాటు చేయడంతో పాటు స్వామివారి ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు, అన్నప్రసాద వితరణ భవనం వద్ద సుమారు రూ.39.90 లక్షల వ్యయంతో స్టెయిన్‌లెస్ స్టీల్ క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

### ఇతర నిర్ణయాలు

2027 సంవత్సరానికి వివిధ రకాల క్యాలెండర్లు, డైరీలను ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ విధానంలో ముద్రించాలని సమావేశం నిర్ణయించింది. ఆలయ ముందు సాలుమండపాల నిర్మాణాన్ని ప్రస్తుతానికి వాయిదా వేసినప్పటికీ, క్యూ కాంప్లెక్స్, పిలిగ్రిమ్ అమినిటీస్ కాంప్లెక్స్, శౌచాలయాలు, సాలుమండపాల నిర్మాణాన్ని ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని ధర్మకర్తల మండలి నిర్ణయించింది.

సమావేశంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు. భక్తులకు మరింత పారదర్శకమైన దర్శన వ్యవస్థతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు.

# ఢిల్లీ వేదికగా ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధిపై కీలక మంతనం

**విజయవాడ సమగ్రాభివృద్ధి,**

**పార్టీ బలోపేతంపై ప్రజాప్రతినిధుల సమీక్ష**



న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్) విజయవాడ నగర సమగ్ర అభివృద్ధి, ఎన్టీఆర్ జిల్లా ప్రగతి, తెలుగుదేశం పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్ సమక్షంలో, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఢిల్లీలోని నివాసంలో మంగళవారం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే రాం రాజగోపాల్ (తాతయ్య), విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, విజయవాడ పశ్చిమ టీడీపీ ఇన్‌చార్జి బుద్ధా వెంకన్నతో పాటు జిల్లా పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యకలాపాల విస్తరణపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు మరింత సమన్వయంతో పనిచేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మైలవరం నియోజకవర్గంలో కొనసాగుతున్న రహదారుల అభివృద్ధి, తాగునీటి సదుపాయాలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం, సుస్థిర పాలన అనే మూడు లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని, పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతర అనుసంధానం కొనసాగిస్తూ ప్రభుత్వ పనితీరును ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు.

## లక్ష్య సాధనతోనే విజయ శిఖరాలు: నారా భువనేశ్వరి

**యువతకు నారా భువనేశ్వరి స్ఫూర్తిదాయక సందేశం**

**క్రమశిక్షణ, సాంకేతిక విజ్ఞానం, విలువలతో ముందుకెళ్లాలని పిలుపు**

**పరీక్షల్లో విఫలమైనా జీవితంపై ఆశలు వదులుకోవద్దని సూచన**



కుప్పం(ప్రశ్న న్యూస్) యువత తమ జీవిత లక్ష్యాలపై స్పష్టమైన దృష్టి పెట్టి నిరంతర కృషితో ముందుకు సాగితే ఏ రంగంలోనైనా అత్యున్నత విజయాలను అందుకోవచ్చని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ప్రతి ఒక్కరినీ మెప్పించాలనే ఆలోచనకు బదులుగా లక్ష్యసాధనపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడి పనిచేసే తత్వం విజయానికి మూల సూత్రాలని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె, పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో నిర్వహించిన క్విజ్ కార్యక్రమంలో పాల్గొని వారితో మమేకమయ్యారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని చెప్పారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, సమయపాలన, పెద్దల పట్ల గౌరవం, గురువుల పట్ల మర్యాద వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని, వారి త్యాగాలను ఎన్నటికీ మరవకూడదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కఠినంగా వ్యవహరించినా అది విద్యార్థుల అభివృద్ధి కోసమేనని అర్థం చేసుకోవాలని అన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలని భువనేశ్వరి విద్యార్థులకు సూచించారు. యువత తమ సామర్థ్యాన్ని విశ్వసించి క్రమశిక్షణ, విలువలు, సాంకేతిక విజ్ఞానం, కష్టపడి పనిచేసే తత్వంతో ముందుకు సాగితే వ్యక్తిగత విజయాలతో పాటు దేశాభివృద్ధికి కూడా తమ వంతు సేవ అందించగలరని నారా భువనేశ్వరి ఆకాంక్షించారు.

## సవర గోవిందపురంలో ఘనంగా "ఇంటింటికి తెలుగుదేశం" ప్రారంభం

**ప్రజల వద్దకే ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్తాం: ఎమ్మెల్యే గౌతు శిరీష**

**ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే.**

**.సమస్యల పరిష్కారానికి హామీ**



పలాస(ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని పలాస మండలం సవర గోవిందపురం గ్రామంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. "తల్లికి వందనం" పథకం ద్వారా విద్యార్థులకు ఆర్థిక చేయూత, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, "అన్నదాత సుఖీభవ" పథకం ద్వారా రైతులకు రూ.20,000 పెట్టుబడి సాయం, ఎన్టీఆర్ భరోసా కింద వృద్ధులు, వితంతువులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000, మంచానికే పరిమితమైన వారికి రూ.15,000, డయాలసిస్ బాధితులకు రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విట్టల్, పలాస మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్, మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్ నాయుడు, క్లస్టర్ కన్వీనర్లు తమ్మినేని గంగారం, మురిపింటి కుమార్ రాజు, సవర సోమేశ్, ప్రభుదాస్, కుత్తుం ప్రకాష్, మాధవ, బాలయ్య, మున్నా, శాంతమ్మతో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెయింట్ క్లారెట్ పాఠశాలకు నోటీసులు

**విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదు :ఎం ఈ ఓ శంకరయ్య**

**ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ఆ పాఠశాల బస్సు ఘటనపై నోటీసులు**

**బస్సు కండిషన్ పై వివరణ ఇవ్వాలని ఆదేశాలు**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ పట్టణం అత్వేల్లి లోని సెయింట్ క్లారెట్ పాఠశాలకు మేడ్చల్ ఎంఈఓ శంకరయ్య నోటీసు అదేసారు. ఇటీవల రోడ్డుపై ఆగి ఉన్న లారీని సెయింట్ క్లారిటీ పాఠశాల చెందిన బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటనను మేడ్చల్ ఎంఈఓ సీరియస్ గా తీసుకున్నారు. పాఠశాలల బస్సులు కండిషన్ గా ఉండాలని, అనుభవం కలిగిన డ్రైవర్లతో బస్సులను నడిపించాలని పదేపదే చెబుతున్న సెయింట్ క్లారెట్ బస్సు ప్రమాదానికి గురి కావడం పై ఎంఈఓ సీరియస్ అయ్యారు. ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు విద్యార్థులు గాయపడి బయటపడ్డారని, అదే జరగరానిది ఏమైనా జరిగితే బాధ్యులు ఎవరు అంటూ ఎంఈఓ శంకరయ్య పాఠశాల యాజమాన్యాన్ని మందలించారు. విద్యార్థుల విషయంలో ఇంత నిర్లక్ష్యం గా ఉండడం సరైన పద్ధతి కాదని ఎంఈఓ శంకరయ్య పాఠశాల యాజమాన్యం పై సీరియస్ అయ్యారని సమాచారం. ఈ సందర్భంగా ఆ పాఠశాలకు నోటీసులు అందజేసి మూడు రోజులలో వివరణ ఇవ్వాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు.

### ఎందుకంత నిర్లక్ష్యం

ఆగి ఉన్న లారీని సెయింట్ క్లారిటీ పాఠశాల బస్సు ఢీకొన్న ఘటనపై ఆ పాఠశాల పేరెంట్స్ తో పాటు ఇతరులు మండిపడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల బస్సులు ప్రమాదాలకు గురవుతున్న పాఠశాలల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవడం మర్చిపోతున్నారని విమర్శిస్తున్నారు. బస్సుకండిషన్ గా ఉందా లేదా, డ్రైవరు కు అనుభవం ఉందా? లేదా? అనే అంశాలపై పాఠశాలల యాజమాన్యాలు దృష్టి పెట్టాల్సి ఉండగా కొన్ని పాఠశాలలు నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయని ఆరు పనులు వినిపిస్తున్నాయి. బడి బస్సులను కండిషన్ గా ఉండేలా చూసుకోవాలని విద్యాశాఖ అధికారులు పదేపదే చెప్తున్నప్పటికీ పాఠశాలల యాజమాన్యాలు పెడచెవున పెడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఆర్టిఏ అధికారులు కఠినంగా వివరించాలి

విద్యార్థులు ప్రయాణించే పాఠశాలల బస్సుల విషయంలో ఆర్టిఏ అధికారులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలుఇచ్చే నజరానాలకు లొంగి చూసి చూడనట్లుగా వ్యవహరిస్తే ఆ బస్సులలో ప్రయాణించే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదాలలో పడే అవకాశం ఉందని, స్థానికులు పేర్కొంటున్నారు. పాఠశాలలో ప్రారంభం అయ్యే ముందు ఆయా పాఠశాలల బస్సులు కండిషన్ లో ఉన్నాయా లేవా పరిశీలించాకే సదరు బస్సులు రోడ్డుమీకి రావాల్సి ఉంటుంది.

కానీ ఆర్టిఏ అధికారులు బడి బస్సులు కండిషన్లో ఉన్నాయా లేవా పరిశీలించాక కూడా ప్రమాదాలకు గురవుతున్నాయి అంటే ఎందుకు బాధ్యులు ఎవరు అంటూ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పాఠశాలలు తెరిచిన కొద్ది రోజులకే సెయింట్ క్లారెట్ పాఠశాల బస్సు ప్రమాదానికి గురైంది అంటే ఇందుకు బాధ్యులు ఎవరు అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పార్టీ ఏ అధికారులు కఠినంగా వ్యవహరించి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఆరో అంతస్తు అక్రమ నిర్మాణంపై ఐదేళ్లుగా ఫిర్యాదులే చర్యలు ఎక్కడ.?

**కీర్తి రెసిడెన్సీ వివాదం, బిల్డర్‌పై నివాసితుల ఆరోపణలు**

**జీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నల వర్షం**



గుంటూరు(ప్రశ్న న్యూస్) గోరంట్ల నుంచి ఆటోనగర్ వైపు వెళ్లే ఇన్నర్ రింగ్ రోడ్డులోని విఘ్నేశ్వర నగర్ మూడో లైన్‌లో ఉన్న కీర్తి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో ఆరో అంతస్తు నిర్మాణం చుట్టూ వివాదం మరింత ముదురుతోంది. సుమారు 400 గజాల స్థలంలో నిర్మించిన ఈ అపార్ట్‌మెంట్‌లో ఇప్పటికే పది ఫ్లాట్లు నిర్మించి విక్రయించిన అనంతరం, ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండానే ఆరో అంతస్తు నిర్మాణాన్ని చేపట్టారని అపార్ట్‌మెంట్ నివాసితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. గత ఐదేళ్లుగా పీజీఆర్ఎస్, జీఎంసీ, కలెక్టరేట్, పోలీస్ స్టేషన్‌లను ఆశ్రయించినా సమస్యకు పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాసితుల వాదన ప్రకారం, కీర్తి డెవలపర్స్‌కు చెందిన బిల్డర్ ఎం. ప్రతాప్ కుమార్, ఆరో అంతస్తు నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు లేదా అనుమతుల పత్రాలను జీఎంసీకి సమర్పించకుండానే పనులు చేపట్టారని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై ప్రశ్నించిన ఫ్లాట్ యజమానులతో బిల్డర్ అనుచితంగా ప్రవర్తించారని, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని కూడా వారు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై బిల్డర్ స్పందన తెలియాల్సి ఉంది. ఇది కేవలం ఒక భవనం వివాదం మాత్రమే కాదు. నగర ప్రణాళికా వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తోందన్న ప్రశ్నను కూడా ఈ ఘటన ముందుకు తెస్తోంది. నిర్మాణం ప్రారంభ దశలోనే గుర్తించాల్సిన అక్రమాలు, పూర్తయిన తర్వాత కూడా కొనసాగడం ఎలా సాధ్యమైంది? నగరంలో ప్రతి నిర్మాణంపై పర్యవేక్షణ ఉంటే, ఈ వివాదాస్పద నిర్మాణం ఎందుకు అధికారుల దృష్టికి రాలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అపార్ట్‌మెంట్ వాసుల ప్రకారం, గత ఐదేళ్లలో అనేకసార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు నమోదు చేశారు. కలెక్టరేట్‌లో వినతిపత్రాలు అందజేశారు. జీఎంసీ కమిషనర్‌ను పలుమార్లు కలిశారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ సమస్యపై తుది చర్యలు మాత్రం కనిపించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంపై కూడా నివాసితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఫిర్యాదు తర్వాత "పరిశీలిస్తాం", "నోటీసులు ఇస్తాం", "సర్వే చేస్తాం" అనే హామీలు తప్ప కార్యాచరణ కనిపించలేదని అంటున్నారు. నోటీసులు జారీ చేయడం వరకే పరిమితమై, చట్టవిరుద్ధ నిర్మాణాన్ని నిలిపివేయడంలో విభాగం విఫలమైందని వారు ఆరోపిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కూడా ఈ అంశాన్ని జీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు నివాసితులు చెబుతున్నారు. అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడినా, "ఈరోజు చేస్తాం", "రేపు పరిశీలిస్తాం" అనే సమాధానాలే వినిపించాయని, కానీ ఫలితం మాత్రం కనిపించలేదని వారు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన రావాల్సి ఉంది. 2017లో నిర్మాణం పూర్తయిన ఈ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అసలు అనుమతులు ఏమిటి? ఆరో అంతస్తుకు ప్రత్యేక అనుమతి ఉందా? లేకపోతే నిర్మాణం ఏ ఆధారంతో కొనసాగుతోంది? ఈ ప్రశ్నలకు అధికారిక సమాధానం ఇప్పటికీ స్పష్టంగా లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నగరాల్లో అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వాలు తరచూ కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తుంటాయి. అయితే, ఫిర్యాదులు వచ్చినప్పటికీ వాటిపై సకాలంలో చర్యలు లేకపోతే చట్టాన్ని పాటించే పౌరుల్లోనే నిరుత్సాహం పెరిగే ప్రమాదం ఉంది. ఒకవైపు సాధారణ ప్రజలు చిన్న నిర్మాణాలకు కూడా అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుండగా, మరోవైపు పెద్ద నిర్మాణాలపై చర్యలు ఆలస్యం కావడం సమానత్వ సూత్రంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నివాసితులు మరో అంశాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. తమ ఫిర్యాదులను పట్టించుకోకపోవడంతో తాము న్యాయం కోసం మీడియాను ఆశ్రయించాల్సి వచ్చిందని, అధికారులు స్పందించి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదని అంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా ఉండాలే తప్ప, ఫిర్యాదులు పేరుకుపోయే కేంద్రాలుగా మారకూడదని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు వెలికితీయడం జీఎంసీ అధికారుల బాధ్యత. ఆరో అంతస్తు నిర్మాణానికి చట్టబద్ధ అనుమతులు ఉన్నాయా లేదా అన్నది ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. అనుమతులు లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అనుమతులు ఉంటే వాటి వివరాలను బహిర్గతం చేసి వివాదానికి ముగింపు పలకాలి. పట్టణ ప్రణాళిక వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టాలంటే పారదర్శకత అత్యంత అవసరం. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, పదేపదే జారీ చేసిన నోటీసులు, ఈ పరిస్థితి ప్రజల్లో అనుమానాలు పెంచుతోంది. అధికారుల నిర్లక్ష్యమా? పరిపాలనా వైఫల్యమా? లేక ఇతర కారణాలున్నాయా? అనే సందేహాలకు సమాధానం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. కీర్తి రెసిడెన్సీ వివాదం ఒక అపార్ట్‌మెంట్ సమస్య మాత్రమే కాదు. పట్టణ ప్రణాళికా వ్యవస్థ, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం, చట్ట అమలు సామర్థ్యానికి ఇది ఒక పరీక్షగా మారింది. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచి, చట్టం ముందు అందరూ సమానమే అనే సూత్రాన్ని ఆచరణలో నిరూపిస్తారా? లేక ఈ ఫిర్యాదులు కూడా మరో ఫైల్‌గా మిగిలిపోతాయా? అన్నది ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్న అంశంగా మారింది

# గుంటూరులో శాశ్వత ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయండి

**600 మంది పాత్రికేయుల ఏకైక విజ్ఞప్తి**

**(వెంకట్-- ప్రశ్న న్యూస్ ఏపీ బ్యూరో )**

గుంటూరు జిల్లా రాజకీయ, సామాజిక, విద్యా, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది. ప్రతిరోజూ అనేక ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, రాజకీయ పరిణామాలు, అభివృద్ధి పనులు, సామాజిక సంఘటనలు జిల్లాలో చోటుచేసుకుంటుంటాయి. ఈ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే బాధ్యతను నిర్వర్తిస్తున్న వారు పాత్రికేయులు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధులు సమాజానికి నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ, గుంటూరు నగరంలో వారికి ఒక శాశ్వత ప్రెస్ క్లబ్ లేకపోవడం విచారకరం. జిల్లాలో చిన్న, పెద్ద దినపత్రికలు, టెలివిజన్ ఛానళ్లు, డిజిటల్ మీడియా, వెబ్ పోర్టళ్లు, యూట్యూబ్ న్యూస్ ప్లాట్‌ఫారమ్‌లతో కలిపి సుమారు 600 మందికి పైగా పాత్రికేయులు విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం, అత్యవసర పరిస్థితుల్లో సమాచారాన్ని వేగంగా అందించడం వంటి బాధ్యతలను వారు నిర్వర్తిస్తున్నారు. అయితే, వారందరికీ ఒకే చోట సమావేశమయ్యే, అధికారిక మీడియా సమావేశాలు నిర్వహించే, చర్చలు జరిపే శాశ్వత వేదిక మాత్రం ఇప్పటికీ లేదు. ప్రస్తుతం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మీడియాతో మాట్లాడాలంటే హోటళ్లు, ప్రైవేట్ హాళ్లు లేదా తాత్కాలిక ప్రదేశాలపై ఆధారపడుతున్నారు. కొన్నిసార్లు కార్యాలయాల ఆవరణల్లో లేదా రోడ్ల పక్కనే మీడియా సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది గుంటూరు వంటి ప్రధాన జిల్లా కేంద్రానికి తగిన పరిస్థితి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రెస్ క్లబ్ అనేది కేవలం జర్నలిస్టులు కూర్చునే భవనం కాదు. అది ప్రజాస్వామ్య సంభాషణకు ఒక వేదిక. జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు ఒకే వేదికపై మీడియాతో మాట్లాడే అవకాశం కల్పించే కేంద్రం. ప్రజలకు సంబంధించిన కీలక ప్రకటనలు, అత్యవసర సమాచారాన్ని వేగంగా అందించడంలో కూడా ప్రెస్ క్లబ్ కీలక పాత్ర పోషిస్తుంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆధునిక సదుపాయాలతో ప్రెస్ క్లబ్‌లు విజయవంతంగా పనిచేస్తున్నాయి. సమావేశ మందిరాలు, మీడియా కాన్ఫరెన్స్ హాళ్లు, ఇంటర్నెట్ సదుపాయం, శిక్షణా కేంద్రాలు, గ్రంథాలయాలు వంటి సౌకర్యాలతో అవి మీడియా కార్యకలాపాలకు బలమైన వేదికలుగా నిలిచాయి. గుంటూరు వంటి ప్రాధాన్య జిల్లాలో కూడా అలాంటి వేదిక అవసరం మరింత ఎక్కువగా ఉంది. యువ పాత్రికేయులకు శిక్షణా కార్యక్రమాలు, మీడియా నైతిక విలువలు, డిజిటల్ జర్నలిజం, ఫ్యాక్ట్ చెకింగ్, విపత్తుల సమయంలో వార్తల సేకరణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కూడా ప్రెస్ క్లబ్ ఉపయోగపడుతుంది. అలాగే పాత్రికేయుల మధ్య సమన్వయం పెరగడానికి, వృత్తిపరమైన చర్చలు జరగడానికి ఇది ఒక కేంద్రంగా మారుతుంది. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ భూమిని కేటాయించడం లేదా అనువైన స్థలంలో శాశ్వత ప్రెస్ క్లబ్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలని జిల్లాలోని పాత్రికేయులు కోరుతున్నారు. ఇది కేవలం జర్నలిస్టుల కోసం చేసే పని మాత్రమే కాదు; ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే నిర్ణయం కూడా అవుతుంది. ప్రజల కోసం కలం పట్టే చేతులకు ఒక చిరునామా కావాలి. నిజాలను ప్రపంచానికి చేరవేసే గొంతుకలకు ఒక వేదిక కావాలి. గుంటూరులో శాశ్వత ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడం నేటి కాలంలో విలాసం కాదు, అత్యవసరం. జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటే గుంటూరు జిల్లా పాత్రికేయుల చిరకాల కోరిక నెరవేరడమే కాకుండా, ప్రజాస్వామ్యానికి మరింత బలమైన వేదిక ఏర్పడినట్లవుతుంది.

## 'చిన్న చిన్న ఆశై' మూవీ రివ్యూ!



మధుబాల – ఇంద్రన్స్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే 'చిన్న చిన్న ఆశై'. వర్ష వాసుదేవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, జూన్ 19వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ రోజు (జులై 28వ తేదీ) నుంచి తమిళ .. మలయాళ భాషలతో పాటు తెలుగులోనూ ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. గతంలో మధుబాల కథానాయికగా నటించిన 'రోజా' సినిమాలోని పాట నుంచి వచ్చిన టైటిల్ కావడం అందరిలో ఆసక్తిని రేకెత్తించింది.

'వారణాసి'లో మాధవన్ మాస్టారు (ఇంద్రన్స్) కూతురు జానకి (అపర్ణ బాలమురళి) చదువుకుంటూ సంప్రదాయ నృత్యాన్ని నేర్చుకుంటూ ఉంటుంది. ఆమెను చూడటం కోసం కేరళ నుంచి అప్పుడప్పుడు అతను వచ్చి వెళుతుంటాడు. అలా వారణాసి వచ్చిన అతనికి, భయంతో ఒంటరిగా మిగిలిపోయిన ఒక మహిళ కనిపిస్తుంది. తన పేరు 'లీల' (మధుబాల) అని ఆమె అతనితో చెబుతుంది. 'తంజావూరు' నుంచి తామంతా ఒక బృందంగా వచ్చినట్టు చెబుతుంది. 'లీల' సెల్ ఫోన్ .. ఆమె 'పర్స్' ను దొంగ కాజేశాడనీ, అతనిని వెంబడించే ప్రయత్నంలో ఆమె తన బృందం నుంచి తప్పిపోయిందని మాధవన్ అర్థం చేసుకుంటాడు. తప్పిపోయినవారి సమాచారాన్ని అందించే కేంద్రంలో 'లీల' పేరు రాయించిన మాధవన్, ఆమె కోసం ఎవరైనా వస్తే తనకి కాల్ చేయమని చెప్పి తన సెల్ నెంబర్ ఇస్తాడు. భయపడవలసిన పనిలేదనీ, తంజావూరు టీమ్ తో కలిసి తిరిగి వెళ్లిపోవచ్చని ఆమెకి మాధవన్ ధైర్యం చెబుతాడు. మొదట్లో కాస్త భయపడినప్పటికీ, ఆ తరువాత ఆమె తన గురించిన వివరాలను అతనికి చెబుతుంది. అతను కూడా తన భార్య తనకి శాశ్వతంగా దూరమైపోయిందంటూ తన కథను వివరిస్తాడు. లీలకి వారణాసి చూడాలని ఉందని తెలుసుకున్న మాధవన్, ఆమెను వెంటబెట్టుకుని ఆ చుట్టుపక్కల ప్రదేశాలు చూపిస్తాడు. ఆ సమయంలో వారికి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయి? ఆ పరిచయం వారి జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది మిగతా కథ.జీవితం సమస్యలతో సతమతం చేసినప్పుడు .. విధి ఒంటరిని చేసి నిలబెట్టినప్పుడు ఆ మనసు ప్రశాంతతను కోరుకుంటుంది. స్వచ్ఛమైన మరో మనసు తోడును కోరుకుంటుంది. అలాంటి తోడు దొరికినప్పుడు ప్రతి చిన్న సంఘటన ఒక అందమైన జ్ఞాపకంగా మారిపోతూ ఉంటుంది .. గుండె గదులను అనుభూతిగా హత్తుకుపోతూ ఉంటుంది. అలాంటి రెండు ఒంటరి మనుషుల కథ ఇది .. ఒంటరి మనసుల కథ ఇది.జీవితం ఒక మోడుగా మారిపోయిందని నిరాశపడిపోయిన 'లీల' .. ఒంటరి తనాన్ని మరిచిపోవడం కోసం ఆనందాన్ని వెతుక్కునే మాధవన్, 'వారణాసి'లో అనుకోకుండా కలుసుకుంటారు. వేదాంతం .. వైరాగ్యం అడగకుండానే అనుభవంలోకి వచ్చే దృశ్యాల మధ్య, జీవితం చేసిన గాయాలను వాళ్లిద్దరూ పంచుకుంటారు. చిన్న చిన్న ఆశలను నెరవేర్చుకోవడానికి పెద్దగా సమయాన్ని కేటాయించవలసిన పనిలేదని భావించే ఇద్దరు మనుషుల చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు.వారణాసిలో .. ఒకే ఒక రోజులో జరిగే పరిచయం రెండు మనసులను ఎంతగా ప్రభావితం చేస్తుంది .. ఎంతగా ఊరట కలిగిస్తుందనేది దర్శకుడు ఆవిష్కరిస్తూ వెళ్లిన తీరు ఆకట్టుకుంటుంది. అయితే ఫీల్ కోసం కేటాయించిన సమయం, ఆడియన్స్ కి సాగతీతగా అనిపిస్తుంది. సన్నివేశాలు మరీ నిదానంగా సాగుతున్న భావన కలుగుతుంది. చివర్లో వచ్చే ట్విస్ట్ మనసును తాకుతుంది. ఇంద్రన్స్ నటనకు వంకబెట్టవలసిన పనిలేదు. ఇక మధుబాల దగ్గరికి వచ్చేసరికి, ఆమె పాత్రను డిజైన్ చేసిన తీరు కాస్త అయోమయంలో పడేస్తుంది.

ఆమె ఎక్స్ ప్రెషన్స్ లోని ఆంతర్యం ఏమిటనే కన్ఫ్యూజన్ ప్రేక్షకులకు ఉండిపోతుంది. ప్రధానమైన పాత్రలకు తారసపడే రెండు మూడు పాత్రలు కూడా విషయం లేనివిగానే అనిపిస్తాయి. అపర్ణ బాలమురళి పై చిత్రీకరించిన పాట ప్రత్యేక ఆకర్షణగా చెప్పుకోవచ్చు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదనిపిస్తాయి.జీవితంలో ఓడిపోయినప్పుడు .. ఒంటరిగా మిగిలిపోయినప్పుడు ప్రతి మనసు ఒక తోడును కోరుకుంటుంది. అలాంటి ఒక పరిచయం జరిగితే అది శాశ్వతంగా నిలిచిపోవాలని ఆశపడుతుంది. కరిగే కాలం ఆ కోరికను మన్నిస్తుందా? లేదా? అనే ఒక సందేహానికి సమాధానంగా ఈ కథ నడుస్తుంది. ఫీల్ ఉన్నప్పటికీ .. కథనం మరీ నిదానించినట్టుగా అనిపిస్తుంది.

# రిజర్వేషన్లపై ఫేక్ పోస్ట్..

### – తీవ్రంగా స్పందించిన శిల్పాశెట్టి

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక నకిలీ పోస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని రిజర్వేషన్ల వ్యవస్థపై తాను స్పందించినట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అదంతా పూర్తిగా కల్పితమని, దురుద్దేశంతో చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆమె కొట్టిపారేశారు. ఇటువంటి తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిల్పాశెట్టి ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పోస్ట్ చేసినట్లుగా ఉన్న ఒక స్క్రీన్‌షాట్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. "జనరల్ కేటగిరీ వైద్యులు కేవలం జనరల్ కేటగిరీ రోగులకు మాత్రమే చికిత్స చేయాలి. ఇతర కులాల వైద్యులు వారి వారి కులాల వారికి మాత్రమే చికిత్స అందిస్తే, రిజర్వేషన్లు వద్దనే డిమాండ్ వస్తుంది. రిజర్వేషన్ ద్వారా నైపుణ్యం రాదు" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రచారంపై శిల్పాశెట్టి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ వివరణ ఇచ్చారు. "రిజర్వేషన్లపై నా పేరుతో ఇటువంటి తప్పుడు ప్రకటనలు వైరల్ కావడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దురుద్దేశపూర్వక ప్రచారం. దయచేసి ఇటువంటి నకిలీ వార్తలను నమ్మకండి" అని ఆమె పోస్ట్ చేశారు. అయితే, సదరు పోస్టును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించి ఉండవచ్చని భావిస్తున్నారు.



# ఎన్టీఆర్‌కు గాయం

అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్‌కు గాయమైంది. సోమవారం సాయంత్రం ఆయన భుజానికి గాయమైనట్లు ఎన్టీఆర్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నది. డాక్టర్ జె. మధుసూదన్ రావు, ఆర్. ఏ. పూర్ణ చంద్ర తేజస్వి నేతృత్వంలోని డాక్టర్ల బృందం ఆయనకు చికిత్సను అందిస్తున్నారని వెల్లడించింది. ఎన్టీఆర్ పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల సమయం పడుతుందని డాక్టర్లు సూచించారని, అభిమానులు ఎవరూ ఆందోళన చెందొద్దని ఆ ప్రకటనలో కోరారు.ఎన్టీఆర్ ఆరోగ్యం తాలూకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారికంగా తెలియజేస్తామని ఆయన కార్యాలయం పేర్కొన్నది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.



## దేశ విభజన నేపథ్యంలో సన్నీ డియోల్

# 'బట్వారా 1947'.. ట్రైలర్ రిలీజ్!

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హాజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.




## క్యారవాన్‌లోకి వచ్చి

# చౌక్కా విప్పేశాడు

### షూటింగ్ సెట్‌లో చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్న కాజల్!

ప్రముఖ కథానాయిక కాజల్ అగర్వాల్ షూటింగ్ సెట్‌లో తనకు ఎదురైన ఒక భయంకరమైన సంఘటనను గుర్తుచేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ సినిమా షూటింగ్ పూర్తయ్యాక తాను క్యారవాన్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా, అదే చిత్రంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి ఎలాంటి అనుమతి తీసుకోకుండా, కనీసం తలుపు కూడా కొట్టకుండా లోపలికి వచ్చేశాడని ఆమె తెలిపారు. ఆ తర్వాత అతడు వెంటనే తన చొక్కా విప్పి, ఛాతీపై ఉన్న కాజల్ పేరు టాటూను చూపించాడని, ఆ హఠాత్ పరిణామానికి తన కాళ్లు చేతులు వణికిపోయాయని కాజల్ వెల్లడించారు. అభిమానంతో టాటూ వేయించుకోవడం సంతోషమే అయినా, ఒక మహిళ ఒంటరిగా ఉన్నప్పుడు అనుమతి లేకుండా క్యారవాన్‌లోకి రావడం ఏమాత్రం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఎంత పెద్ద అభిమాని అయినా ఇటువంటి ప్రవర్తనను ఎంతమాత్రం సహించలేమని, ఇలాంటి పనులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించి అతడిని అక్కడి నుంచి పంపించి వేసినట్లు కాజల్ చెప్పారు. 2004లో హిందీ చిత్రం 'క్యూన్! హో గయా నా'తో అరంగేట్రం చేసిన కాజల్, ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'మగధీర' చిత్రంతో స్టార్ హీరోయిన్‌గా మారిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత డార్లింగ్, బృందావనం, మిస్టర్ పర్ఫెక్ట్, బిజినెస్ మ్యాన్, నాయక్, బాద్‌షా, ఎవడు, టెంపర్ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల తో అలరించడమే కాకుండా బాలీవుడ్‌లో 'సింగం', 'స్పెషల్ 26' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.



## 'పాల్తు జాన్వర్' మూవీ రివ్యూ!




మలయాళంలో బాసిల్ జోసెఫ్ కి మంచి క్రేజ్ ఉంది. కామెడీ టచ్ తో సాగే పాత్రలలో ఆయన నటన విశేషంగా ఆకట్టుకుంటుంది. ఓటీటీలలో ఆయన సినిమాలకి .. సిరీస్ లకు మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. ఆయన కథానాయకుడిగా రూపొందిన సినిమానే 'పాల్తు జాన్వర్'. సంగీత్ రాజన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, 2022 – సెప్టెంబర్ లో థియేటర్లకు వచ్చింది. ఆ తరువాత మలయాళంలో ఓటీటీకి వచ్చింది. రీసెంటుగా తెలుగులో అందుబాటులోకి వచ్చింది. ప్రసూన్ (బాసిల్ జోసెఫ్) యానిమేషన్ కి సంబంధించిన ఒక సంస్థను ఏర్పాటు చేసి ఆర్థికంగా దెబ్బతింటాడు. అదే సమయంలో అతని తండ్రి చనిపోతాడు. పశుసంవర్ధక శాఖలో ఆయన పనిచేస్తూ ఉండేవాడు. అందువలన ఆ జాబ్ ప్రసూన్ కి వస్తుంది. విలేజ్ వాతావరణం అతనికి ఎంతమాత్రం అలవాటు లేదు .. పశువులకు సంబంధించిన ఏ విషయాలు ప్రసూన్ కి తెలియదు. అయినా అక్కాబావల మాటను కాదనలేక, అయిష్టంగానే ఆ విలేజ్ కి వెళతాడు. పశువులకు సంబంధించిన వైద్యశాలలో 'లైవ్ స్టాక్ ఇన్ స్పెక్టర్' గా అడుగుపెడతాడు. అక్కడ డాక్టర్ గా సునీల్ (షమ్మీ తిలకన్) ఉంటాడు. ఆయనకి తాను చేస్తున్న పనిపై ఎంత మాత్రం ధ్యాస ఉండదు. బయట బిజినెస్ లపై ఎక్కువగా ఫోకస్ చేస్తుంటాడు. ఇక అటెండర్ 'మాథ్యూస్' ప్రతి విషయాన్ని లైట్ తీసుకుంటూ ఉంటాడు. చర్చి ఫాదర్ తో కలిసి గ్రామసభలు ఏర్పాటు చేయడం .. హడావిడి చేయడం తనవంతు అన్నట్టుగా 'జార్జ్' ( ఇంద్రన్స్) వ్యవహరిస్తూ ఉంటాడు. అటు పంచాయితీపై .. ఇతి పశు వైద్యశాలపై 'డేవిస్' (జాన్ ఆంటోని) కోపంగా ఉంటాడు. తనకి ఇష్టం లేని జాబ్ కావడం వలన, ప్రసూన్ తన పని పట్ల చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఉంటాడు. దాంతో అటు డాక్టర్ సునీల్ .. ఇటు గ్రామసభ సభ్యులు అతనిని నానా ఇబ్బందులు పెడుతూ ఉంటారు .. నలుగురిలో అవమానిస్తూ ఉంటారు. తాను ఈ జాబ్ చేయాలా?మానేయాలా? అనే ఒక సందేహంలో ప్రసూన్ ఉండగానే, అతని కారణంగా ఒక పోలీస్ డాగ్ చనిపోతుంది. అప్పుడు ఏం జరుగుతుంది? ఆ సంఘటన ఎలాంటి పరిణామాలకి దారితీస్తుంది? అనేది కథ. జీవితంలో చాలామంది తాము చేస్తున్నది తమ స్థాయికి తగిన పని కాదనే ఒక అసంతృప్తితో రోజులు గడిపేస్తూ ఉంటారు. తమ స్థాయి పనికాదనే ఒక ఫీలింగ్ తో ఉండటం వలన, చేస్తున్న పనిపై శ్రద్ధ పెట్టలేరు. ఆ పనిలో నైపుణ్యాలను సాధించే ప్రయత్నాలు అసలే చేయలేరు. ఈ కథలోని కథానాయకుడి పరిస్థితి కూడా అదే. ఈ కారణంగా తన వృత్తి విషయంలో అతనికి ఎదురైన అనుభవాల చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఎక్కడైనా .. ఏ రంగంలోనైనా పనిచేసే ప్రతి మనిషిలో రెండు కోణాలు కనిపిస్తాయి. ఇది మనం చేసే పనికాదు అనుకుంటే ఒకలా పనిచేస్తాడు. ఈ పనిని మనం చేయవలసిందే .. మరో మార్గం లేదు అనుకుంటే కష్టపడే తీరు వేరుగా ఉంటుంది. ఇష్టం లేని పని మానుకోవడానికి సవాలక్ష కారణాలు వెతుక్కునేవారు, తమ నిర్ణయాన్ని సమర్థించేవారు లేకపోతే వెనక్కి తగ్గడం చాలా చోట్లా జరిగేదే. ఒక మనిషిలోని భిన్నమైన ఈ కోణాలను చాలా సహజంగా ఆవిష్కరించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేశాడనే చెప్పాలి. విలేజ్ లలో పశువులను కూడా కుటుంబ సభ్యులుగా చూసుకుంటూ ఉంటారు. వాటి పోషణ – రక్షణ విషయంలో వాళ్లు చాలా కేర్ఫుల్ గా ఉంటారు. అయితే అక్కడికి వెళ్లిన ప్రసూన్ కి ఈ విషయం ఆలస్యంగా అర్థమవుతుంది. పశువైనా దానిదీ ప్రాణమే .. ఆ పశువుతో అక్కడి వాళ్లకి ఎంతటి అటాచ్ మెంట్ ఉంటుందనేది అతని అనుభవంలోకి వస్తుంది .. ఆలోచింపజేస్తుంది. అతనిలోని ఈ మార్పును ఆవిష్కరించిన విధానం ఆడియన్స్ ను మెప్పిస్తుంది. 'నా కూతురు కడుపుతో ఉంది .. మా ఆవు కూడా కడుపుతో ఉంది .. ఇద్దరినీ నేను ఒకేలా చూసుకుంటాను' అనే మాట, పశువుల పట్ల గ్రామస్తులకు ఉండే ప్రేమకి అద్దం పడుతుంది. ఇక గ్రామీణ ప్రజలలో చాలావరకూ మూఢ నమ్మకాలు ఉంటాయి. ఈ విషయంలో వాళ్ల బలహీనతను తమ బలంగా మార్చుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తూ ఉంటారు. అలాంటి సన్నివేశాలు సున్నితమైన హాస్యాన్ని అందిస్తూ ముందుకు సాగుతాయి. విలేజ్ నేపథ్యం .. పెద్దగా చదువుకోని మనుషులు .. వాళ్ల స్వభావాలు .. బలహీనతలను ఆవిష్కరిస్తూ వెళ్లే ఈ కథలో, ప్రతి పాత్ర చాలా సహజంగా కనిపిస్తుంది.

ఈ కథ మన ఊళ్లో జరుగుతున్న భావన కలుగుతుంది. కథాకథనాలతో పాటు విలేజ్ నేపథ్యం మనసుకు హత్తుకుపోతుంది. గ్రామస్తులే తప్ప ఆర్టిస్టులు కనిపించరు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ కథ మరింత బలంగా కనెక్ట్ కావడంలో తమవంతు పాత్రను పోషించాయి. ఒక మారుమూల గ్రామం .. అక్కడి ప్రజలు .. పశువైద్యశాల .. అక్కడ పనిచేసే అధికారులను కలుపుకుంటూ ఈ కథ ముందు వెళుతుంది. ప్రధానమైన కథ ఒక ఆవు చుట్టూ తిరుగుతుంది.

'ఏ పని చేసినా మనసు పెట్టి చేయి .. అంకితభావంతో చేయి .. అప్పుడు పొందే ఆత్మసంతృప్తి మరెందులోను లభించదు' అనే ఒక సందేశం ఈ కథలో మనకి కనిపిస్తుంది. విలేజ్ నేసథ్యంలోని సినిమాలను ఇష్టపడేవారికి ఇది తప్పకుండా నచ్చుతుంది.

# ధర్పల్లి రైతు వేదికలో తెలంగాణ జలశ్రీ అవగాహన





ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని రైతు వేదికలో తెలంగాణ జలశ్రీ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి డి ఎల్ పి ఓ శ్రీనివాస్, యం పి డి ఓ. మారుతి, తహసీల్దార్ శాంత, ఎం పి ఓ శ్రీధర్, ఏ పి ఎం మనోహర్, సూపరింటెండెంట్ సారంగపాణి, ధర్పల్లి సర్పంచ్ శ్రీనివాస్ అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, మండలంలోని అన్ని గ్రామ సర్పంచులు,అన్ని పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. తెలంగాణ జలశ్రీ పథకం ద్వారా గ్రామాల్లో తాగునీటి సరఫరా, పైప్ లైన్ల నిర్వహణ, నీటి సంరక్షణపై అధికారులు చర్చించారు. ప్రతి గ్రామంలో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు సర్పంచులు, కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు.

## మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



వెంకటాపురం(ప్రశ్న న్యూస్)ములుగు జిల్లా వెంకటాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు అదేవిధంగా ప్రజలకు అవసరమైన సేవలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కీలక నిర్ణయాలు

**వర్షాకాల ముందస్తు చర్యలు - పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

**- ఇంటింటికీ చెత్త సేకరణకు కఠిన పర్యవేక్షణ**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సౌకర్యాల మెరుగుదలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి గంగిశెట్టి చందన రవీందర్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ పీ. గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా పారిశుద్ధ్య లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరణ జరిగేలా, చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజూ అన్ని వార్డుల్లో క్రమం తప్పకుండా తిరిగేలా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని సమావేశంలో చర్చించారు.అలాగే, పట్టణంలోని గ్రామకంఠం పరిధిలో ఉన్న ఇండ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరూ, ఛైర్‌పర్సన్ చందన రవీందర్,వైస్ ఛైర్‌పర్సన్, కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్ , మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త మేడ్చల్ సిఐ కి సన్మానం




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ సీఐ అంజిరెడ్డి ని ఆర్ టి ఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షులు, రమేష్ గుప్తా కలిసి సన్మానించారు. మేడ్చల్ సిఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అంజిరెడ్డిని ఆర్టిఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ గుప్తా సీఐ అంజిరెడ్డిని కలిసి శాలువా కప్పి సన్మానించారు.మేడ్చల్ పట్టణంలో నీ ప్రధాన సమస్యలను సీఐ దృష్టికి తీసుకెళ్లారు. సామాన్య ప్రజలకు ఏలాంటి సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని,అదే విధంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, అధ్యక్షురాలు, నాచారం విజయలక్ష్మి, సిద్ధి పేట్ జిల్లా అధ్యక్షురాలు,మాకం లావణ్య, ఈశ్వరమ్మ,ఉన్నారు

# తంజీముల్ మసీద్ కమిటీ అధ్యక్ష ఎన్నికల్లో షేరు భాయ్ బరిలో

**మసీదుల అభివృద్ధి -- మైనార్టీల సంక్షేమమే నా లక్ష్యం**

**అసంపూర్తి అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత నాదే**

**- అధ్యక్ష పదవికి అవకాశం ఇవ్వండి: మహమ్మద్ షేర్ అలీ**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12 మసీదులతో ఏర్పాటైన తంజీముల్ మసీద్ కమిటీ అధ్యక్ష ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. సోమవారం ప్రారంభమైన నామినేషన్ ప్రక్రియలో మహమ్మద్ షేర్ అలీ (షేరు భాయ్) అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. రానున్న ఆగస్టు 2న జరిగే ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని పట్టణ మైనార్టీ సోదరులను కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో షేరు భాయ్ మాట్లాడుతూ, మసీదుల సమగ్ర అభివృద్ధి, మైనార్టీల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మసీదుల్లో మౌలిక వసతుల కల్పన, విద్యుత్, తాగునీరు, మరమ్మతులు, పారిశుద్ధ్య సౌకర్యాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ఇంకా పూర్తి కావాల్సిన అభివృద్ధి పనులను పూర్తిచేసే బాధ్యత తనకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా కృషి చేస్తానని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. అలాగే మైనార్టీల కోసం ప్రత్యేక స్మశాన వాటిక ఏర్పాటు దిశగా ప్రభుత్వంతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మాజీ అధ్యక్షుడు సయ్యద్ యూసుఫొద్దీన్ మాట్లాడుతూ, తంజీముల్ మసీద్ కమిటీ ఎన్నికలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించి, మైనార్టీల ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సేవా భావమే కమిటీ లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ పెద్దలు, మాజీ మసీదు కమిటీ సభ్యులు, యువ నాయకులు, పట్టణానికి చెందిన పలువురు ముస్లిం ప్రముఖులు పాల్గొని మహమ్మద్ షేర్ అలీకి ఘన మద్దతు ప్రకటించారు.

## మేత లేక.. పాడి రైతుల కడగండ్లు

**పోషకాహార లోపంతో కుప్పకూలుతున్న పాడి పశువులు**

**-- పాల దిగుబడి తగ్గి రైతులకు తీవ్ర ఆర్థిక సంక్షోభం**

**90% సబ్సిడీపై మినీ చాప్ అండ్ గ్రైండింగ్ మిషన్లు**

**అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని ధర్మరెడ్డిపల్లి గ్రామంలో పశుగ్రాసం కొరత పాడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పశువులకు సమతుల్య పోషకాహారం అందక క్యాల్షియం, మినరల్స్ లోపంతో అవి బలహీనపడి లేచి నిలబడలేని పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గి పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.ప్రస్తుతం పశువులకు ఎండు వరి గడ్డి మాత్రమే అందుతుండటంతో అవసరమైన పోషకాలు అందడం లేదని రైతులు తెలిపారు. పాలిచ్చే పశువులు తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో చికిత్స ఖర్చులు పెరగడంతో పాటు పాల ఉత్పత్తి తగ్గి ఆదాయం క్షీణిస్తోందన్నారు. పరిస్థితి మరింత విషమించడంతో కొందరు రైతులు తమ పశువులను తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా మిల్క్ గ్రిడ్ పథకం కింద 90 శాతం సబ్సిడీతో మినీ చాప్ అండ్ గ్రైండింగ్ మిషన్లు అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ యంత్రాల ద్వారా పచ్చి సోప్పు, మొక్కజొన్న, జొన్న, నెపియర్ గడ్డి వంటి పశుగ్రాసాన్ని చిన్న ముక్కలుగా కట్ చేసి సైలేజ్ తయారు చేసి ఏడాది పొడవునా నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. దీంతో మేత వృథా కాకుండా పశువులకు పోషకాహారం అందడంతో పాటు పాల దిగుబడి కూడా పెరుగుతుందని రైతులు పేర్కొన్నారు. పాడి రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి 90 శాతం సబ్సిడీపై గ్రైండింగ్ మిషన్లు అందించడంతో పాటు పశుగ్రాసం అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మేడ్చల్ టౌన్ సెక్షన్‌లో విద్యుత్ అధికారుల విస్తృత సమీక్షా సమావేశం

**ఫిర్యాదుల త్వరిత పరిష్కారానికి ఆదేశాలు**

**అభివృద్ధి పనులపై సమగ్ర చర్చ**

**బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపు**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడమే ధ్యేయంగా మేడ్చల్ టౌన్ సెక్షన్ విద్యుత్ ఉద్యోగులతో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశం నిర్వహించారు. మేడ్చల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్, సీనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్ ప్రభు, డివిజనల్ ఇంజనీర్ జాన్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రాజమల్లేశం మరియు మేడ్చల్ టౌన్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రాంబాబు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చూడాలని, ముఖ్యంగా వినియోగదారుల నుండి వచ్చే అత్యవసర సేవలు మరియు ఫిర్యాదులను అతి తక్కువ వ్యవధిలోనే పరిష్కరించాలని అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు అవసరమైన దిశానిర్దేశం చేస్తూ, వారి భద్రత మరియు సేవా ప్రమాణాలపై పలు సూచనలు చేశారు. రాబోయే రోజుల్లో మేడ్చల్ ప్రాంత పరిధిలో చేపటనున్న విద్యుత్ వ్యవస్థ నవీకరణ మరియు ఇతర అభివృద్ధి పనులపై కూడా ఈ సందర్భంగా అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తూ, విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ సెక్షన్‌కు చెందిన విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి

**మేడ్చల్ రూరల్ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్**

**ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఒక్క ఓటరు కూడా**

**మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలి**

**కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి**

**విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపు**



మేడ్చల్( ప్రశ్న న్యూస్) పార్టీ బలోపేతానికి బిజెపి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మేడ్చల్ రూరల్ అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఎల్లంపేట్ మున్సిపాలిటీ బిజెపి కార్యవర్గ సమావేశం. మున్సిపల్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన ఎల్లంపేటలోని ఓ ఫంక్షన్ హాల్ లో జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి బూతులో బూత్ పటిష్టంగా ఎలా నిర్మించుకోవాలో సూచనలు చేశారు. అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హుడైన ప్రతి ఒక్క ఓటర్ ఓటు మిస్ కాకుండా ఉండడం కోసం బిజెపి శ్రేణులు కృషి చేయాలన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యల పైన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి బిజెపి కార్యకర్త ముందుండాలని పేర్కొన్నారు. ప్రతి సమస్య పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ పూర్తిస్థాయిలో ప్రజల వైపు ఉండి కొట్లాడం కోసం ముందు వరుసలో ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వము చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు విక్రం రెడ్డి మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంటెస్టెడ్ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లంపేట జగన్ గౌడ్,ప్రభాకర్ రెడ్డి,ఎల్లంపేట మున్సిపాలిటీ ఇంచార్జ్ హంస కృష్ణ గౌడ్, నరేందర్ రెడ్డి ఎల్లంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రజిత దేవేందర్ రెడ్డి కౌన్సిలర్లు అర్చన శ్రీనివాస్ మహేశ్వరి రాజేష్,ప్రధాన కార్యదర్శులు మహేష్ ప్రకాష్ నాయకులు సురేందర్ సింగ్ మాజీ సర్పంచ్ పోచయ్య మాజీ ఎంపిటిసి రవి నాయక్ పుష్ప మల్లారెడ్డి రవి ముదిరాజ్ రవిబాబు ఉష గారి బాబు రాజశేఖర్ రెడ్డి భూపాల్ శాంతి జీవన్ బూత్ అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుంటూరులో గన్ షాక్

**నకిలీ ధ్రువపత్రాలతో తుపాకుల సమీకరణ**

**రైఫిల్, షాట్‌గన్, పిస్టల్, 50 బుల్లెట్లతో నిందితుడు అరెస్ట్**

**ఫోర్జరీ సంతకాలతో ఆయుధాల లైసెన్స్..**

**విజయవాడ మిస్‌ఫైర్ కేసులోనూ కీలక నిందితుడే**

**జిల్లాలో అసాంఘిక శక్తులకు హెచ్చరిక జారీ చేసిన: ఎస్పీ వకుల్ జిందాల్**



గుంటూరు(ప్రశ్న న్యూస్) గుంటూరు జిల్లాలో అక్రమ ఆయుధాల వ్యవహారం కలకలం రేపింది. నకిలీ ధ్రువపత్రాలు, అధికారుల ఫోర్జరీ సంతకాలతో తుపాకులు, బుల్లెట్లు సంపాదించిన వ్యక్తిని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి ఒక .22 రైఫిల్, ఒక బోర్ షాట్‌గన్, ఒక పిస్టల్, 50 బుల్లెట్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు.అరెస్టైన నిందితుడిని తాడికొండకు చెందిన విజయహర్షగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం అతను చిత్తూరు జిల్లాలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఫోర్స్ షూటింగ్ కోసం ఆయుధాలు అవసరమని పేర్కొంటూ నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి లైసెన్సులు పొందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం, విజయవాడలోని ఓ షాపింగ్ మాల్‌లో జరిగిన మిస్‌ఫైర్ ఘటనలో కూడా విజయహర్ష నిందితుడిగా ఉండటంతో అతడి కోసం గత కొంతకాలంగా గాలింపు కొనసాగుతోంది. ఈ క్రమంలో నగరంపాలెం పోలీసులు పక్కా సమాచారంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు.విచారణలో భాగంగా నిందితుడు పొన్నెకల్లు గ్రామంలోని ఓ వెంచర్‌లో తుపాకులతో ప్రాక్టీస్ చేసినట్లు సమాచారం లభించిందని ఎస్పీ తెలిపారు. ఈ కోణంలో కూడా పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు.నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 318(4), 336(3) తో పాటు ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 25(1) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో ఆయుధాలు ఎలా పొందగలిగాడు? ఇందులో మరెవరైనా సహకరించారా? అనే అంశాలపై సమగ్ర విచారణ కొనసాగుతోంది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారెవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అక్రమ ఆయుధాల వినియోగం, నిల్వ, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడం జిల్లాలో సంచలనం సృష్టించింది. అక్రమ ఆయుధాల వ్యవహారం వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మహిళలకు న్యాయం చేయలేని వారు ప్రజలకు ఏం న్యాయం చేస్తారు: పీతల సుజాత

**మాజీ మంత్రి కుటుంబంపై వచ్చిన ఆరోపణలపై వైసీపీ**

**నాయకత్వం స్పందించాలని డిమాండ్**




మంగళగిరి (ప్రశ్న న్యూస్): మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబానికి సంబంధించిన వివాదంపై తెలుగుదేశం పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించింది. మాజీ మంత్రి, ఏపీడబ్ల్యూసీఎఫ్‌సీ చైర్‌పర్సన్ పీతల సుజాత మాట్లాడుతూ, మహిళల భద్రత, గౌరవం గురించి మాట్లాడే వైసీపీ నాయకులు తమ పార్టీ మాజీ మంత్రి కుటుంబానికి సంబంధించిన ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బాధిత మహిళ చేసిన ఫిర్యాదులో ఉన్న ఆరోపణలను సమగ్రంగా విచారించి, నిజానిజాలు వెలికి తేవాలని ఆమె కోరారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ హోదా లేదా పార్టీతో సంబంధం లేకుండా మహిళపై జరిగిన ఆరోపణలను నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని అన్నారు.పార్టీ ప్రభుత్వంపై విమర్శలు చేసే వైసీపీ మహిళా నాయకులు, తమ పార్టీకి చెందిన మాజీ మంత్రి కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో మౌనం ఎందుకు పాటిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. మహిళల సమస్యలపై స్పందించడం రాజకీయాలకు అతీతంగా ఉండాలని, ఏ పార్టీకి చెందిన మహిళ అయినా అన్యాయం జరిగితే అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.పీతల సుజాత మాట్లాడుతూ, వరకట్న వేధింపులు, మహిళలపై హింస వంటి ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, వాటిని తేలికగా తీసుకోవద్దన్నారు. బాధితురాలు చేసిన ఫిర్యాదులోని ప్రతి అంశాన్ని పోలీసులు నిష్పక్షపాతంగా విచారించి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు.

# న్యాయం చేయండి లేకపోతే..

# కారుణ్య మరణానికి అనుమతివ్వండి

## – ప్రజావాణిలో వృద్ధ దంపతుల గోడు



నల్గొండ (ప్రశ్న న్యూస్) నల్గొండ జిల్లాలో హృదయవిదారక ఘటన వెలుగులోకి వచ్చింది. కడుపున పుట్టిన తమ సొంత కొడుకు కుటుంబం నుంచి ప్రాణహాని ఉందంటూ ఓ వృద్ధ దంపతులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించడం తీవ్ర కలకలం రేపుతోంది. తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని అది సాధ్యం కాకపోతే కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని మిర్యాలగూడ ఆర్డీవోకు ఆ దంపతులు వినతిపత్రం సమర్పించారు. వృద్ధ దంపతుల ఆవేదన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన గగ్గినపల్లి బుచ్చిరెడ్డి, అనసూయ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారికి ఉన్న భూమిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచిన తర్వాత వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు, జీవనోపాధి కోసం 3 ఎకరాల 11 గుంటల భూమిని ఆ వృద్ధ దంపతులు తమ వద్ద ఉంచుకున్నారు. తమను చూసుకుంటున్న మనవడికి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేశామని అప్పటి నుంచి పెద్ద కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం ఆ భూమిలో కూడా వాటా ఇవ్వాలని ఒత్తిడి చేస్తోందని వారు ఆరోపించారు. ఆస్తి వివాదం కారణంగా గతంలో వీల్‌చైర్‌కే పరిమితమైన బుచ్చిరెడ్డిపై పెద్ద కోడలు చెప్పుతో దాడి చేసిందని ఆ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కూడా అయ్యాయని వృద్ధ దంపతులు మిర్యాలగూడ ఆర్డీఓకు వివరించారు. ఆ ఘటనపై వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనప్పటికీ వేధింపులు మాత్రం ఆగలేదని చెప్పారు. ఇక ఈ కేసును వెనక్కి తీసుకోవాలని లేకుంటే ట్రాక్టర్‌తో తొక్కించి చంపేస్తామని పెద్ద కుమారుడు, కోడలు, మనవడు తమను బెదిరిస్తున్నారని ఆ వృద్ధ దంపతులు ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు పోలీసులను ఆశ్రయించినా వారు సరైన చర్యలు తీసుకోలేదని పైగా తమనే దుర్భాషలాడారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సోమవారం మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ఆ వృద్ధ దంపతులు అధికారుల ముందు తమ గోడును వినిపించారు. తమకు రక్షణ కల్పించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకవేళ న్యాయం చేయలేకపోతే కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని రోదిస్తూ వినతిపత్రం సమర్పించారు. వృద్ధ దంపతుల వినతిని స్వీకరించిన ఆర్డీవో రమణారెడ్డి పూర్తి విచారణ చేపట్టి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామని చెప్పి వారిని ఓదార్చారు. ఆ వృద్ధ దంపతుల బాధ చూసిన స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

# సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా తెలంగాణ

## – స్కైరూట్ ఏరోస్పేస్ సీఈఓ తో సీఎం భేటీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్ ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) నాగ భరత్ డాకా ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భారతదేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్–క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్–1 ను విజయవంతంగా ప్రయోగించిన తీరును వారు సీఎంకి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. సమావేశంలో తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధన–అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ప్రభుత్వం– ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య సహకార అవకాశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వారు సాధించిన విజయం భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుతుందని ప్రశంసించారు.

# అది పన్నీర్ కాదు ప్రాణాలు తీసే విషం

- కీసరలో కల్తీ పన్నీర్ కేంద్రంపై ఎస్ఓటీ అధికారుల దాడులు
- విచ్చలవిడిగా తయారవుతున్న కల్తీ పన్నీర్
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కేటుగాళ్లు
- దొరికితే కంటి తుడుపు కేసులు, మళ్లీ అదే దందా






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు తింటున్న పన్నీర్ నిజంగా పన్నీర్‌నా.? లేక ప్రాణాలు తీసే విషమా.? అనే అనుమానాలు రోజురోజుకూ బలపడుతున్నాయి. కీసర పరిసరాల్లో నడుస్తున్న కల్తీ పన్నీర్ తయారీ కేంద్రంపై ఎస్ఓటీ అధికారులు నిర్వహించిన దాడుల్లో సుమారు 1000 కిలోల కల్తీ పన్నీర్ స్వాధీనం కావడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో నగరంలో ఆహార భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### కెమికల్స్‌తో పన్నీర్ తయారీ, ప్రజల ఆరోగ్యంతో ఆటలు

అక్రమ సంపాదన కోసం కొందరు కేటుగాళ్లు నాసిరకం పదార్థాలు, ప్రమాదకర రసాయనాలు ఉపయోగించి కల్తీ పన్నీర్ తయారు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ పన్నీర్ నగరంలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లకు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, రెస్టారెంట్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం, ఈ విషయం తెలిసి ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం ఏమవుతుందనే కనీస బాధ్యత లేకుండా డబ్బే లక్ష్యంగా ఈ మాఫియా వ్యవహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### దాడులు జర్నలిస్టుల సమాచారంతోనేనా.?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అనేక ప్రాంతంలో జరుగుతున్న ఈ అక్రమ దందాపై స్థానిక జర్నలిస్టులు అందించిన సమాచారంతోనే ఎస్ఓటీ పోలీసులు దాడులకు సిద్ధమయ్యారనే చర్చ సాగుతోంది. ప్రశ్న ఏమిటంటే... ఇంత పెద్ద ఎత్తున అక్రమ తయారీ జరుగుతున్నా ఫుడ్ ఇన్స్పెక్టర్లకు, మున్సిపల్ అధికారులకు, స్థానిక పోలీసు యంత్రాంగానికి ఎందుకు కనిపించలేదు.? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### స్థానిక పోలీసుల కనుసైగల్లోనే అక్రమ వ్యాపారాలా.?

కల్తీ ఆహార పదార్థాల నియోగంపై ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలు మరింత తీవ్రమవుతుంటే మొక్కుబడిగా దాడులు చేస్తున్నారు. కొన్ని అక్రమ వ్యాపారాలు స్థానిక పోలీసుల కనుసైగల్లోనే సాగుతున్నాయనే విమర్శలు ప్రజల నుండి తీవ్రంగా వినిపిస్తున్నాయి. దాడులు జరిగిన తర్వాత కేసులు నమోదు చేసి కంటి తుడుపు చర్యలతో చేతులు దులుపుకోవడం తప్ప అక్రమ దందాలకు శాశ్వత అడ్డుకట్ట వేయడంలో అన్ని శాఖల అధికారులు విఫలమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దానితో తిరిగి అక్రమార్కులు అదే అక్రమ వ్యాపారమును యదేచ్ఛగా నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారు.

### ముఖ్యమంత్రి హెచ్చరికలు చేసిన అధికారుల్లో చలనం ఎక్కడ.?

ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి ప్రభావం ఎక్కడ కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ, పోలీసు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో కల్తీ మాఫియా మరింత రెచ్చిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దానితోపాటు కొంతమంది అధికారులు సిబ్బంది ఆహార కల్తీ మాఫియా నాయకులకు పూర్తిగా సహకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

### వాహనాల సీజ్‌తోనే దందాకు చెక్

కల్తీ పన్నీర్, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న ఆటోలు, ఇతర వాహనాలను కనీసం ఒక సంవత్సరం పాటు సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కేసులు నమోదు చేయడం వల్ల ప్రయోజనం లేదని, అక్రమ సంపాదనకు ఉపయోగపడుతున్న వాహనాలను పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకొని సంవత్సరం పాటు సీజ్ చేస్తేనే మాఫియాకు గట్టి దెబ్బ తగులుతుందని కానీ కొంతమంది అధికారులు నెలలోపే అక్రమ మార్గంలో పోలీస్ స్టేషన్లో ఉన్న సీజ్ అయిన వాహనాలను వదిలి వేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అత్యంత కఠిన చర్యలతోనే ప్రజల ప్రాణాలకు రక్షణ



కల్తీ ఆహార పదార్థాలు అమ్మే వారిని సాధారణ నేరస్తులుగా కాకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే (హంతకులులుగా) నేరగాళ్లుగా పరిగణించి కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిజిపిని, కమిషనర్లను ప్రజలు కోరుతున్నారు. ఎస్ఓటీ దాడులతో బయటపడిన ఈ వ్యవహారం ఒక్క కేంద్రానికే పరిమితం కాకుండా గ్రేటర్ హైదరాబాద్ నగరమంతటా విస్తరించి ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కల్తీ పన్నీర్ మాఫియాను పూర్తిగా నిర్మూలించి తమ ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# జనసంద్రమైన సింహాచలం

## – వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ



సింహాచలం (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

# మన్యం ప్రాంతంలో సిమెంట్ రోడ్లకు పగుళ్లు!

## – కాంట్రాక్టర్ బిల్లులు నిలిపేయాలని పవన్ ఆదేశాలు!



అమరావతి (ప్రశ్న న్యూస్) పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పెదపెంకి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత పనుల బిల్లులను వెంటనే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెదపెంకి గ్రామంలో నిర్మించిన కొన్ని సిమెంట్ రోడ్లలో పగుళ్లు ఏర్పడిన విషయం ఆయన దృష్టికి వచ్చింది. ఈ అంశంపై రాష్ట్ర స్థాయి చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారిని పెదపెంకి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో ఐదు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పెదపెంకిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌తోపాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదపెంకిలో చేపట్టిన రోడ్లు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పవన్ స్పష్టం చేశారు. పెదపెంకిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యతలను స్థానిక శాసనసభ్యులు కూడా తీసుకోవాలని సూచించారు.

# ఇంటింటికి తెలుగుదేశం 2026

## – రాష్ట్రవ్యాప్తంగా 2.18 లక్షలకు పైగా ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు

అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం 2026' కార్యక్రమం రెండో రోజూ రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా, మంగళవారం ఒక్కరోజే పార్టీ శ్రేణులు 2,18,619 ఇళ్లను సందర్శించాయి. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో పాటు క్షేత్రస్థాయి కార్యకర్తలు ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాలనలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్లకు గాను 1,827 క్లస్టర్లలో, 8,750 యూనిట్లకు గాను 6,680 యూనిట్లలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి సైతం ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు.

వరుసగా రెండో రోజు ఆమె కుప్పం నియోజకవర్గంలో పర్యటించి, స్థానిక ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, వాటి ద్వారా ప్రజలకు చేకూరుతున్న లబ్ధిని ఆమె వివరించారు. ఈ కార్యక్రమ పురోగతిని తెలుగుదేశం పార్టీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటం గమనార్హం. నియోజకవర్గాల వారీగా కార్యక్రమ అమలును సమీక్షిస్తూ, మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలను చేరవేసే వరకు ఈ



కార్యక్రమాన్ని కొనసాగిస్తామని టీడీపీ నేతలు చెబుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588